ఈనాడు
పశ్చిమగోదావరి
శుక్రవారం అక్టోబరు 4, 2024

జయరూపిణి.. జగదానందకారిణి!

అంతటా శరన్నవరాత్రి శోభ



పెనుగొండ: వాసవీశాంతిధామ్‌లో బాలా త్రిపురసుందరి

భీమవరం ఆధ్యాత్మికం, పెనుగొండ, న్యూస్‌టుడే: భీమవరం ఐదవేల్పు మావుళ్లమ్మ ఆలయంలో శరన్నవ రాత్రి మహోత్సవాలకు గురువారం ఉదయం 4.30 గంటలకు కలశ స్థాపనతో శ్రీకారం చుట్టారు. అమ్మవారికి విశేష పుష్పాలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ ప్రాంగణంలో మావుళ్లమ్మ ఉత్సవ మూర్తికి సువర్ణ రజత కవచాలంకరణ, పలు గగనాలను నేత్ర పర్వంగా అలంకరించి కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయ కళా వేదికపై చండీహోమం, లక్ష కుంకుమార్చనలను వేద పండితులు భక్తులతో చేయించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించి ఆశీస్సులు పొందారు. సాయంత్రం కళా వేదికపై ఆధ్యాత్మిక ప్రవచనం, జానపద నృత్య ప్రదర్శన నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా పలు చోట్ల నవరాత్రుల ఉత్సవాలను ప్రారంభించారు.



భీమవరం మావుళ్లమ్మ సన్నిధిలో సువర్ణ రజత కవచాలంకరణలో అమ్మవారి ఉత్సవమూర్తి గరగలు

చేయాల్సింది 63.. చేస్తున్నవి 23

● పీహెచ్‌సీల్లో పూర్తిస్థాయిలో సాగని వైద్య పరీక్షలు ● జ్వరాలు విజృంభిస్తున్న వేళ రోగులపై అదనపు భారం

ఈనాడు డిజిటల్, భీమవరం, నరసాపురం, భీమవరం గ్రామీణం, తణుకు గ్రామీణం, పెనుగొండ గ్రామీణం, న్యూస్‌టుడే

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోని ల్యాబుల్లో నిర్ధారణ పరీక్షలు సక్రమంగా సాగక గ్రామీణ ప్రాంత ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పలుచోట్ల యంత్రాలున్నా రసాయనాలు, రీఏజెంట్లు లేకపోవడం.. మరికొన్నిచోట్ల ల్యాబ్ టెక్నీషియన్ల కొరత వేధిస్తోంది. జ్వరాలు విజృంభిస్తున్న వేళ పల్లెల్లో రోగులకు సక్రమంగా వైద్య సేవలు అందక వారికి ఆర్థిక భారం తప్పడంలేదు.



☛ 18 గ్రామాల పరిధిలోని ప్రజలకు వైద్య సేవలందించే గొల్లవానితిప్ప పీహెచ్‌సీలో అన్ని రకాల పరీక్షలు చేయకపోవడంతో కొంతకాలంగా ఓపీ సంఖ్య తగ్గింది. మధుమేహం, రక్తపోటు పరీక్షలు మాత్రమే చేస్తున్నారు. ఇతర పరీక్షలకు ప్రైవేటు ల్యాబ్‌లకు వెళ్లమంటున్నారు. వైద్యులు అందుబాటులో ఉండటం లేదని గ్రామానికి చెందిన పిల్లా సాయిబాబు వాపోయారు.

● మొగల్తూరులో టైఫాయిడ్, మలేరియా, సీబీపీ, మధుమేహం, ఎన్‌ఎస్‌యం పాజిటివ్ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇతర పరీక్షలకు ప్రైవేటు ల్యాబ్‌లను ఆశ్రయిస్తున్నారు. తూర్పుతాళ్లు, ఎల్‌బీచర్లలో ల్యాబ్‌టెక్నీషియన్ ఒక్కరే ఉన్నారు. వీరు లేని రోజుల్లో స్టాఫ్‌నర్సు పరీక్షలు నిర్వహిస్తున్నారు. పక్క చిత్రం తూర్పుతాళ్లులోనిది.



పరిశీలన

టైఫాయిడ్, ప్లేట్‌లెట్ల కిట్లు లేవు.. సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్న తరుణంలో పీహెచ్‌సీల్లో ప్లేట్‌లెట్లు, టైఫాయిడ్ పరీక్షలు చేసేందుకు కిట్లు లేకపోవడంతో రోగులు ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. పీహెచ్‌సీల్లో సీఆర్‌పీ, ఎస్‌జీఓటీ, ఎస్‌జీపీటీతో పాటు హిమోగ్లోబిన్, ప్లేట్‌లెట్ కౌంట్, సీబీసీ, రాండమ్ బ్లడ్ షుగర్, బ్లడ్ యూరియా తదితర 63 పరీక్షలు చేయాల్సి ఉంది. చాలా చోట్ల గరిష్ఠంగా 23 రకాల పరీక్షలు చేస్తున్నారు.

రేలంగి, అత్తిలి పీహెచ్‌సీల్లో రెండు చోట్లా ఒకే ల్యాబుటెక్నీషియన్ మూడేసి రోజులు విధులు నిర్వహిస్తున్నారు. మధుమేహం, రక్తపోటు పరీక్షలు మాత్రమే నిర్వహిస్తున్నారు. రేలంగిలో ఫార్మసిస్టు లేకపోవడంతో ట్రైనీ సిబ్బంది, స్టాఫ్ నర్సులే సేవలు అందిస్తున్నారు. వేల్పూరులో ల్యాబు టెక్నీషియన్ లేకపోవడంతో రక్తపరీక్షలకు సైతం తణుకు ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లాలని సూచిస్తున్నారు.



● సిద్ధాంతం పీహెచ్‌సీలో రోజూ సుమారు 80 ఓపీ ఉంటుంది. పరీక్షలు చేసేందుకు పరికరాలు, ల్యాబ్ టెక్నీషియన్, వైద్యులున్నా ప్లేట్‌లెట్లు, టైఫాయిడ్ పరీక్షలు చేసేందుకు కిట్లు లేకపోవడంతో రోగులు ప్రైవేటు ల్యాబ్‌లను ఆశ్రయిస్తున్నారు. పరికరాలు ఇలా మూలకు చేరాయి.



అంతంత మాత్రమే

జిల్లాలో 34 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలున్నాయి. వీటిలో వైద్యులు ఉంటే... సిబ్బంది సరిపడా లేరు. ఓ రకం పరీక్షలు చేస్తే మరోరకానికి ప్రైవేటు ల్యాబ్‌కు వెళ్లాల్సి వస్తోంది. పది పీహెచ్‌సీల్లో రక్త, మూత్ర పరీక్షలు చేయాల్సిన ల్యాబ్ టెక్నీషియన్లు లేకపోవడంతో నమూనాలను సేకరించి వేరొక పీహెచ్‌సీకి తీసుకెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.

ఔషధాల నిల్వలకే సరిపోతున్నాయి

వ్యాధి నిర్ధారణ పరీక్షలకు సంబంధించి రీఏజెంట్లు, ఎనలైజర్లు ఫ్రిడ్జ్‌లో భద్రపరిస్తేనే వినియోగానికి వీలుగా ఉంటాయి. బయట ఉంచితే రీడింగ్‌ల్లో తేడాలొస్తాయి. ప్రస్తుతం పీహెచ్‌సీల్లో ఉన్న ఫ్రిడ్జ్‌లు వ్యాక్సిన్లు, మందుల నిల్వలకే సరిపోతున్నాయి. అత్యవసరమైన రక్త కణాల సంఖ్య పరీక్ష పరికరాలు కూడా అంతంత మాత్రంగానే ఉన్నాయి. డెంగీ జ్వరం బారిన పడిన వారికి రక్తకణాల సంఖ్య పరీక్షించి అవసరమైన చికిత్స చేయాల్సి ఉంటుంది. ప్రభుత్వం ప్రకటించిన 63 పరీక్షల్లో ఇదీ ఒకటి. అయినా అందుకు సంబంధించిన పరికరాలు చాలాచోట్ల లేవు. డీఎంహెచ్‌వో మహేశ్వరరావు వివరణ కోరగా ఉన్నతాధికారులకు నివేదించి అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

ఇంకా బోణీ కాలే

రెండోరోజూ దరఖాస్తులు లేవు

వేచి చూసే ధోరణిలో మద్యం వ్యాపారులు

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: మద్యం దుకాణాలకు రెండోరోజు గురువారం కూడా ఒక్క దరఖాస్తు రాలేదు. కొందరు దరఖాస్తు ఇచ్చినా డీడీ జత చేయలేదని అధికారులు చెప్పారు. శని, సోమవారాల్లో అత్యధికంగా నమోదయ్యే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. మద్యం దుకాణాల నిర్వహణ, ఇతరత్రా వివరాలను ఔత్సాహికులు నేరుగా ఆబ్కారీ కార్యాలయానికి వచ్చి తెలుసుకుంటున్నారు.

అదృష్టం పరీక్షించుకుందామా..?.. గత అయిదేళ్లలో ఆక్వా రంగ, రియల్ వ్యాపారాలు దెబ్బతిన్నాయి. ఆయా రంగాల్లో ఉన్నవాళ్లలో చాలామంది నష్టపోయారు. దీంతో మద్యం వ్యాపారంపై కొందరి దృష్టి పడింది. అలాగని సాహసం చేయడానికి వెనుకాడుతున్నారు. సిండికేట్‌లో కలిస్తే ఫలితం ఉంటుందని, వ్యక్తిగతంగా వెళ్లి దరఖాస్తు ఇస్తే డబ్బులూ దక్కవనే భయం ఉంది. గతంలో మద్యం వ్యాపారాల్లో ఉన్నవారిలో 10 శాతం మాత్రమే ఇప్పుడు ముందుకొస్తున్నారు. వారిలో కూడా ఆశాజనకంగా వస్తున్న వారు అరుదుగా కనిపిస్తున్నారు. స్థానిక రాజకీయ నాయకుల అండదండలుండక పోతే రూ.లక్షలు మద్యంలో ధారపోసినట్లేనని కొందరు వెనక్కి తగ్గుతున్నారు.

అత్యధికం భీమవరమే..!.. జిల్లాలోని 175 దుకాణాల్లో అత్యధికంగా భీమవరంలో 24 ఉన్నాయి. మండలాల్లో కాళ్ల, పెనుగొండల్లో 9 చొప్పున దుకాణాలకు అవకాశం ఉంది. మిగిలిన చోట్ల చాలా వ్యత్యాసాలున్నాయి. గతంలో మద్యం ఏరులై పారిన చోట ఈసారి దుకాణాలు తక్కువగా వెలుస్తున్నాయి. గ్రామాలు, విస్తీర్ణం, జనాభాలో సరిసమానంగా ఉన్న మండలాల్లోనే దుకాణాల సంఖ్యలో వ్యత్యాసం ఎక్కువగా ఉంది. వాటిలో కూడా పూర్తి స్థాయి వివరాలు తెలియకపోవడం కూడా దరఖాస్తులు అంతంత మాత్రంగా ఉండటానికి కారణంగా తెలుస్తోంది.

సందట్లో సడేమియా..?.. ఉద్యోగ భద్రత కోరుతూ ప్రైవేటు దుకాణాల్లోని పని చేస్తున్నవాళ్లంతా ఆందోళన చేస్తున్నారు. కొన్నిచోట్ల ఆలస్యంగా దుకాణాలు తెరవడం, ముందుగానే మూతబడటంతో మద్యం ప్రియులు బార్‌లను ఆశ్రయిస్తున్నారు. ఇదే అదనుగా ధరలు పెంచి సొమ్ములు చేసుకుంటున్నారని మందుబాబులు వాపోతున్నారు.

దేవాలయాల పరిరక్షణ, అభివృద్ధే లక్ష్యం: మంత్రి

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: దేవాలయాల పరిరక్షణ, అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. ఆగిరిపల్లి శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీ నరసింహస్వామి ఆలయం దగ్గర నుంచి దుర్గా పార్వతీ సమేత మల్లికార్జున స్వామి ఆలయం వరకు ఘాట్ రోడ్డు నిర్మాణానికి కొలుసు పార్థసారథి, ఏలూరు కలెక్టర్ కె.వెట్రిసెల్వితో కలిసి గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. మంత్రులు, కలెక్టర్‌కు వేద పండితులు, దేవాదాయ శాఖ ఉప కమిషనరు డీఎల్వీ రమేశ్‌బాబు, జిల్లా అధికారి రంగారావు, ఆలయ ఈవో డి.సురేశ్‌బాబు ఘన స్వాగతం పలికారు. దాత మడుపల్లి రామనాగ లక్ష్మీనారాయణ రావు, వారి కుమారుడు మడుపల్లి గోపాల్ కుటుంబసభ్యులు రూ.40 లక్షలతో నిర్మించిన స్వామివారి కల్యాణ మండపాన్ని మంత్రులు ప్రారంభించారు. సభలో మంత్రి రామనారాయణ రెడ్డి మాట్లాడుతూ.. శిథిలావస్థలో ఉన్న ఆలయాల పునర్నిర్మాణాలకు నిధులు కేటాయిస్తామన్నారు. మంత్రి పార్థసారథి మాట్లాడుతూ.. ప్రముఖ పుణ్య క్షేత్రాలను ఆధ్యాత్మికంగా, పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు.



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న మంత్రులు రామనారాయణ రెడ్డి, పార్థసారథి, కలెక్టర్ వెట్రిసెల్వి తదితరులు

బదిలీకే కాదు.. సీటుకు సిఫార్సు ఉందోయ్!

ఆదాయ వనరులున్న ప్రాంతాలపై గురి

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: పశ్చిమగోదావరి జిల్లా కేంద్రమైన భీమవరం పురపాలక సంఘంలో బదిలీల పర్వం ముగిసింది. ఇతర ప్రాంతాల నుంచి ఇక్కడ బాధ్యతలు చేపడతామంటూ సిఫార్సు లేఖలతో రెక్కలు కట్టుకుని ఆగమేఘాలపై వచ్చినవారూ ఉన్నారు. వాళ్లందరికీ ఆయా విభాగాల్లో సీటు కేటాయింపులు జరుగుతున్నాయి. ఇక్కడా రాజకీయ ఒత్తిళ్లు, సిఫార్సులు మొదలెట్టేశారు. నచ్చిన సీటు కేటాయించాలంటూ కొందరు పట్టుబడుతుంటే, పట్టణంలో ఆదాయ వనరులున్న ప్రాంతాల్లోనే పని చేస్తామంటూ ఇంకొందరంటున్నారు. ఇలాంటి రాజకీయ పైరవీలు చూసిన వాళ్లంతా ఔరా అంటూ ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. బాధ్యతలు నిర్వర్తిస్తారా.. లేకపోతే వాళ్ల మదిలో ఉన్నది చేసుకుపోతారా అని చర్చించుకుంటున్నారు.

అక్కడే.. నన్ను నియమించండి.. ప్రజారోగ్య విభాగంలో ఆదాయ వనరులున్న ప్రాంతాల కోసం ప్రత్యేకంగా ఒత్తిళ్లు తీసుకొస్తున్నారు. ఓ ఉద్యోగి అయితే గతంలో ఇక్కడే చేశాను.. ఇక్కడే మళ్లీ చేస్తానని పట్టుబట్టారు. అందుకు అధికారికంగా అంగీకరించకపోవడంతో సామాజిక పరంగా పెద్దలతో చెప్పించుకున్నారు. ఇంకొకరైతే ఆ.. డివిజన్‌లోనే చేస్తానని ముందే చెప్పి సిఫార్సు లేఖతో వచ్చారట. వాణిజ్య ప్రాంతమైన ఆ.. డివిజన్‌లో చేసేందుకు గతంలో వైకాపా నాయకుల సిఫార్సులతో వచ్చి బాధ్యతలు నిర్వహిస్తున్న ఉద్యోగికి స్థానికంగా మరికొందరు మద్దతిస్తున్నారు.

ఇదొక రాజకీయం.. ఆదాయాన్నిచ్చేవాటిలో పురపాలక రెవెన్యూ విభాగం ఒకటి. ఇంటి పన్నులు వేయాలన్నా, తగ్గించాలన్నా, అసలు వేయకుండా కొంతకాలం గడిపేయాలన్నా కొందరి ఆశీస్సులు ఉంటే చాలు. అందుకు వాళ్లకు ఎంతోకొంత ముట్టజెబితే సరిపోతుంది. ఆకాశాన్నంటే భవనాలున్న చోటు నాదంటే.. నాది అంటూ పట్టుదలకు పోతున్నారు. అవసరమైతే కేంద్ర స్థాయి నాయకులతో చెప్పిస్తానంటూ ఇంకొకరొస్తున్నారు.

మళ్లీ వచ్చేస్తాం.. సారూ!.. బదిలీపై వెళ్లిన కొందరు భీమవరం చూడకుండా ఉండలేక పోతున్నారంట. ఎలాగైనా వచ్చేస్తామంటూ సిఫార్సులు కోసం వెంపర్లాడుతున్నారు. ఇంధనం, చెత్తలో చేతివాటం ఇతర ప్రాంతాల్లో కుదరకపోవడమే కారణంగా తెలుస్తోంది. ఎన్నో తప్పులు చేసిన కొందర్ని మన్నించినట్లే తమకు మరోసారి అవకాశం ఇవ్వాలంటూ నాయకుల ఇంటి గుమ్మంలోనే చేతులు కట్టుకుని నిల్చుంటున్నారని చెప్పుకొంటున్నారు.

ఐదురోజులు రైల్వే గేటు మూసివేత

పాలకోడేరు, న్యూస్‌టుడే: శృంగవృక్షంలో రైల్వే పట్టాల పునర్నిర్మాణంలో భాగంగా గురువారం రైల్వే గేటును మూసివేశారు. ఐదు రోజుల పాటు పనులు నిర్వహించనున్న నేపథ్యంలో ఈ నెల 8 వరకు గేటు మూసివేస్తున్నట్లు అధికారులు తెలిపారు. దీంతో భీమవరం-పాలకొల్లు రాకపోకలు సాగించే వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాల్లో ప్రయాణాలు సాగిస్తున్నారు.

టెట్ పరీక్షలు ప్రారంభం

ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే: ఏలూరు జిల్లాలో ఉపాధ్యాయ అర్హత పరీక్షలు (టెట్) గురువారం ప్రారంభమయ్యాయి. ఏలూరు సమీపంలోని సిద్ధార్థ క్వెస్ట్ సీబీఎస్‌ఈ పాఠశాలలోని కేంద్రంలో తొలిరోజు పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఈ నెల 21 వరకు ఈ పరీక్షలు నిర్వహిస్తారు. చరవాణులు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులను పరీక్ష కేంద్రంలోనికి అనుమతించలేదు.

99.25 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి

భీమవరం వన్‌టౌన్, న్యూస్‌టుడే: జిల్లా వ్యాప్తంగా ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ గురువారం సాయంత్రానికి 99.25 శాతం పూర్తయినట్లు డీఆర్‌డీఏ పీడీ వేణుగోపాల్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 2,30,123 మంది పింఛను లబ్ధిదారులకు గాను 2,28,329 మందికి నగదు పంపిణీ పూర్తి చేశామన్నారు. ఇంకా 1,794 మందికి పింఛను నగదు బట్వాడా చేయాల్సి ఉందన్నారు.

రుణాలకు రెక్కలు.. లబ్ధిదారులకు తిప్పలు

టిడ్కో గృహ లబ్ధిదారులకు తప్పని బ్యాంకుల ఒత్తిడి

వెంటాడుతున్న గత వైకాపా సర్కారు పాపాలు



భీమవరానికి చెందిన షేక్ గౌస్యకు 2017లో 430 చదరపు అడుగుల గృహం మంజూరైంది. సొంతింటి కల నెరవేరుతుందని బంగారాన్ని కుదువ పెట్టి భీమవరం మున్సిపల్ కమిషనర్ పేరిట రూ.లక్ష డీడీ తీసి అందించారు. కానీ నేటికీ ఇల్లు రాకపోగా బ్యాంకు కిస్తీ కట్టాలంటూ తీవ్ర ఒత్తిడి ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.



తణుకులో ఉంటున్న ఎస్.నాగదుర్గ 2018లో 365 చ.అ. గృహానికి రెండు దఫాలుగా రూ.25వేల చొప్పున రూ.50వేలు డీడీలు తీశారు. అద్దెలు, పిల్లల పాఠశాలల ఫీజులు, బ్యాంకు కిస్తీలు అన్ని కట్టాలంటే మరిన్ని అప్పులు చేయాల్సి వస్తుందని కన్నీటిపర్యంతమయ్యారు.

ఈనాడు డిజిటల్, భీమవరం, తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే: గత వైకాపా ప్రభుత్వ నిర్వాకం టిడ్కో లబ్ధిదారులకు శాపంగా మారింది. ఉన్న ఇంటికి అద్దె కట్టలేక, చేసిన అప్పులకు వడ్డీ చెల్లించలేక, బ్యాంకు అధికారుల నుంచి కిస్తీ కట్టాలంటూ ఒత్తిడి ఎదుర్కోలేక నానా తంటాలు పడుతున్నారు. సొంతింటి కల నెరవేరకపోగా లబ్ధిదారుల పేరున బ్యాంకుల నుంచి జగన్ సర్కారు తీసుకున్న రూ. కోట్ల రుణాలు వారి మెడకు చుట్టుకున్నాయి. బ్యాంకులు మంజూరు చేసిన రుణాలు గుత్తేదారునికి చేరకపోవడంతో ఆ నిధులు ఏమయ్యాయని లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నారు.



తణుకులోని టిడ్కో గృహాలు

ఇదీ లక్ష్యం.. గత తెదేపా ప్రభుత్వ హయాంలో ఇళ్ల నిర్మాణంపై సర్వే చేయగా సుమారు 60 వేల కుటుంబాలు సొంతింటి కోసం దరఖాస్తు చేశాయి. 2016-17 నుంచి 2018-19 వరకు కేంద్ర ప్రభుత్వం 20,784 ఇళ్లు మంజూరు చేసింది. పట్టణ మౌలిక సదుపాయాల కల్పన అభివృద్ధి సంస్థ (టిడ్కో) ఆధ్వర్యంలో 300, 365, 430 చదరపు అడుగుల విస్తీర్ణంలో మూడు రకాల గృహ నిర్మాణాలు ప్రారంభించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ. 1.50 లక్షల చొప్పున రాయితీ ఇస్తున్నట్లు ప్రకటించాయి.

మున్సిపాలిటీ	లబ్ధిదారులు	వాటాగా చెల్లించింది రూ.కోట్లలో
భీమవరం	8,352	32
తణుకు	912	7.50
తాడేపల్లిగూడెం	5,376	36
పాలకొల్లు	6,144	40

బ్యాంకు రుణాలు మంజూరు చేసింది సుమారు రూ. 483 కోట్లు

అధికారుల అలసత్వం

2016లో మొదలైన ఇళ్ల నిర్మాణం ఇప్పటికీ పూర్తి కాకపోవడం గమనార్హం. 2019లో ప్రభుత్వం మారడంతో నిర్మాణాలు నిలిచిపోయాయి. వైకాపా ప్రభుత్వం వాటి వైపు కన్నెత్తి కూడా చూడలేదు. 2022లో ఇళ్ల నిర్మాణాల పూర్తికి లబ్ధిదారులకు బ్యాంకు రుణాలు మంజూరు చేయించింది. అవి మున్సిపాలిటీ నుంచి గుత్తేదారుని ఖాతాకు చేరాలి. అయితే వైకాపా హయాంలో ఆ రుణాలు అటు మున్సిపల్ కమిషనర్, ఇటు ఏపీ టిడ్కో, గుత్తేదారులు, లబ్ధిదారుల ఖాతాల్లోనూ జమ కాలేదు.

ఈ లెక్క సరిచేయాల్సిందే!

పాలకొల్లు, న్యూస్‌టుడే

● ఉమ్మడి జిల్లాలో 19 శాతం విద్యార్థులు డుమ్మా
● దసరా సెలవుల అనంతరం చర్యలకు ఆదేశం

రాష్ట్రంలో సరాసరిన 24 శాతం మంది విద్యార్థులు పాఠశాలలకు గైర్హాజరవుతున్నట్లు గుర్తించిన విద్యాశాఖ మంత్రి లోకేశ్ ఆశ్చర్యానికి గురయ్యారు. బడికి వచ్చేవారే రావడం లేదా లేక కేవలం రికార్డుల్లో చూపించడంతో ఇంత వ్యత్యాసం కనిపిస్తుందా.. అనే అనుమానం వ్యక్తం చేస్తూ హాజరుపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ తరుణంలో మన ఉమ్మడి జిల్లాలో పరిస్థితిని పరిశీలిస్తే సరాసరిన 19 శాతం మంది విద్యార్థులు గైర్హాజరవుతున్నారని తేలింది.



ఆరా దీసేవారు కరవు..

గతంలో బడిబయట ఉన్న పిల్లలను గుర్తించడం వారిని పాఠశాలలకు రప్పించడం ఏటా ఆనవాయితీగా జరిగేది. వైకాపా ప్రభుత్వం వచ్చాక అటువంటి కార్యక్రమం ఒకటుందని విద్యాశాఖ మరిచిపోయింది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించడానికి దృష్టి సారించలేదు. అసలు పాఠశాల హాజరు పట్టీలో ఉన్న వారంతా నిత్యం పాఠశాలకు వస్తున్నారా లేదా అనే ఆరాదీసేవారు కరవయ్యారు. రిజిస్టర్‌లో ఉన్నవారికి హాజరవుతున్నవారికి పొంతన లేకుండా పోయింది.

జిల్లా	ప్రాథమిక	ప్రాథమికోన్నత	ఉన్నత	మొత్తం విద్యార్థులు
ఏలూరు	1,390	193	219	1,22,790
పశ్చిమ	1,069	87	212	92,920

వివరణ ఇవ్వలేకనే

వాస్తవానికి గైర్హాజరుకు కారణాలు అడుగుతారు. మధ్యాహ్న భోజనం చేసేవారిని తక్కువ మందిని చూపిస్తే వివరణతో లేఖ రాయమంటారు. ఇవన్నీ ఎదుర్కొనే ఓపిక లేకనే చాలా పాఠశాలల్లో హాజరు నుంచి మధ్యాహ్న భోజనం తినేవారి సంఖ్య వరకు సరైన వివరాలు నమోదు చేయలేకపోతున్నారని ఒక ఉపాధ్యాయుడు వాపోయారు.

పథకాలు పోతాయని

బడికి సరిగా రాకపోయినా ప్రభుత్వ పథకాలు పోతాయనే ఉద్దేశంతో గత ప్రభుత్వ హయాంలో వైకాపా నాయకులు డ్రాపవుట్లు చూపనిచ్చేవారు కాదు. వలసలు వెళ్లినా విద్యార్థులు బడికి రాకపోయినా కొందరి పేర్లు రిజిస్టర్‌లో కొనసాగించడం కొన్నిచోట్ల అలవాటుగా మారింది. ఇవన్నీ కలిసొచ్చి ఉన్న విద్యార్థులకు హాజరవుతున్న విద్యార్థులకు సంబంధం లేకుండా పోతోంది.

ఏలూరు జిల్లాలో అధికం..

దసరా సెలవులు రావడంతో ఈ నెల 1 పాఠశాలలకు చివరి పనిదినం. ఆ రోజున హాజరైన విద్యార్థుల సంఖ్యను పరిశీలిస్తే ఏలూరు జిల్లాలో మొత్తం 1,22,790 మంది విద్యార్థులుండగా 1,76,171 మంది 79 శాతంతో హాజరయ్యారు. పశ్చిమలో ఇదే రోజు హాజరు చూస్తే 92,920 మందికి 78,185 మంది హాజరవడంతో 84శాతం నమోదైంది. ఎక్కడ ఏ సమస్య వస్తుందోనని వాస్తవాలను గుట్టుగా ఉంచుతున్న పరిస్థితి. దీనిపై ఏలూరు జిల్లా విద్యాశాఖాధికారి అబ్రహాంను సంప్రదించగా సెలవుల ముందు రోజు కావడంతో 1వ తేదీన హాజరు తగ్గుండొచ్చన్నారు. సెలవుల అనంతరం అలా ఉండకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

నవోదయలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

పెదవేగి, న్యూస్‌టుడే: పెదవేగిలోని జవహర్ నవోదయ విద్యాలయలో 2025- 26 విద్యా సంవత్సరానికి సంబంధించి 9, 11 తరగతుల్లో ఖాళీ సీట్ల భర్తీకి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ బి.సీతాలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో చదువుతూ బోనఫైడ్ నివాసులైన విద్యార్థులు ప్రవేశ పరీక్షకు అర్హులన్నారు. ఆన్‌లైన్లో దరఖాస్తు చేసేందుకు ఈ నెల 30 వరకు గడువుందని, ప్రవేశ పరీక్ష 2025 ఆగస్టు 8న నిర్వహించనున్నట్లు తెలిపారు.



మాట్లాడుతున్న పద్మశ్రీ, పాల్గొన్న అధికారులు

పంచాయతీరాజ్ బలోపేతానికి కృషి

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రజాప్రతినిధులు, అధికారులకు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేసిందని జడ్పీ ఛైర్‌పర్సన్ పద్మశ్రీ అన్నారు. ఏలూరు జిల్లా పంచాయతీరాజ్ వనరుల శిక్షణ కేంద్రంలో గురువారం ఆమె శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. వార్షిక కార్యాచరణ ప్రణాళిక 2024-25 ప్రకారం పంచాయతీల్లో పది అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. సాధారణ పరిపాలన విధానం, పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా తదితర అంశాలపై అవగాహన, ప్రభుత్వ పథకాలపై శిక్షణ ఇస్తారని తెలిపారు. డిప్యూటీ సీఈవో కె.భీమేశ్వర్, డీఆర్డీఏ పీడీ విజయరాజు, జడ్పీ శిక్షణ విభాగం సమన్వయకర్త ప్రసంగిరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు జిల్లా స్థాయి సమావేశం

ఏలూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: స్వర్ణాంధ్ర 2047పై ఏలూరు జిల్లా స్థాయి సమావేశాన్ని ఈ నెల 4న ఉదయం 11 గంటలకు కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో నిర్వహించనున్నారు. మంత్రి కొలుసు పార్థసారథి అధ్యక్షతన జరిగే సమావేశంలో కలెక్టర్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొంటారు.

సౌకర్యాలేవీ!



పేదలకాలనీల్లో కనీస సౌకర్యాలు కానరావడం లేదు. సరైన రహదారులు, డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగు పోటెత్తుతోంది. బురదలో ఇళ్లకు వెళ్లేందుకు స్థానికులు అవస్థలు పడుతున్నారు. సౌకర్యాలు కల్పించాలని గత వైకాపా ప్రభుత్వంలో విన్నవించినా మా మొర ఆలకించలేదని వాపోతున్నారు. దోమలు వ్యాప్తి చెందడంతో రోగాల బారిన పడుతున్నామని చెబుతున్నారు. -ఈనాడు, ఏలూరు.



తణుకు మండలం వేల్పూరులో రహదారి దుస్థితి

ఆగిరిపల్లిలోని జగనన్నకాలనీలో కాలువలు లేకపోవడంతో మురుగు కోసం ఇళ్ల ముందు గోతులు తవ్వుకున్నారిలా..



వేల్పూరులోని కాలనీలో పోటెత్తిన మురుగు

మూషికా.. కాచుకో ఇక



పోడూరు, మార్టేరు, న్యూస్‌టుడే: ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కోవడం పక్కనపెడితే ఏటా పొలంలోనే స్థిర నివాసం ఏర్పరచుకుని రైతు ఆదాయానికి గండికొడుతున్న మూషికాలను ఎదుర్కోవడమే పెద్ద సవాలుగా మారుతోంది. ఈ క్రమంలో వ్యవసాయశాఖ జిల్లాలో సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ మేరకు శుక్రవారం రైతులకు ఉచితంగా ఎలుకల మందు పంపిణీ చేయనున్నారు.

☛ జిల్లాలోని 20 మండలాల్లోని 379 గ్రామాల్లో 1,17,479 హెక్టార్ల పంట, పోరంబోకు భూమిలో ఈ నిర్మూలన ప్రక్రియ చేయనున్నారు.

☛ దీనికి 1175 కిలోల బ్రోమోడయలిన్ మందుతో విషపు ఎరను తయారు చేసి పంపిణీ చేస్తారు.

☛ ఈ కార్యక్రమం ద్వారా పశ్చిమగోదావరి జిల్లాలో 1.23 లక్షల మంది రైతులకు ప్రయోజనం చేకూరుతుంది.

☛ దీని కోసం మైనర్ పంచాయతీలు రూ.2 వేలు, మేజర్ పంచాయతీలు రూ.3 వేల చొప్పున నిధులు వెచ్చించేందుకు ప్రభుత్వం పంచాయతీలకు వెసులుబాటు ఇచ్చింది.

సామూహికంగా చేస్తే ప్రయోజనం

96 పాళ్లు వరి నూకలతో రెండు పాళ్ల నూనెను బాగా పట్టించి రెండు పాళ్ల బ్రోమోడలియన్ మందు కలపాలి. ఈ మందును పేపరులో చిన్న పొట్లాలుగా తయారు చేసుకుని ఎలుకల బొరియాల్లో(కన్నాల్లో) ఉంచాలి. తయారు చేసిన మందును వెంటనే వాడాలి.

– డాక్టర్ ఎన్.శ్రీనివాసరావు, సీనియర్ శాస్త్రవేత్త, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, మార్టేరు

☛ ఉంగుటూరుకు చెందిన సత్యానంద్ హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీరుగా ఉద్యోగం చేస్తున్నారు. 'దసరా' పండగ సందర్భంగా స్వగ్రామానికి రావాలని అనుకున్నారు. ఆర్టీసీ బస్సుల్లో టికెట్లను బుక్ చేసుకునేందుకు ఆన్‌లైన్‌లో చూడగా సీట్లన్నీ ఫుల్ అయినట్లు చూపింది. ప్రైవేటు ట్రావెల్స్‌కు సంబంధించిన యాప్‌లను పరిశీలించారు. వాటిలో సీట్లు ఖాళీగా ఉన్నాయి. కానీ సాధారణ రోజుల్లో వసూలు చేసే ధరకంటే రెండు నుంచి మూడు రెట్లు అధికంగా చూపిస్తున్నాయి. గత్యంతరం లేని పరిస్థితుల్లో సత్యానంద్ తనతోపాటు భార్య, కుమారుడికి కలిపి మొత్తం మూడు టికెట్లను ఒక ప్రైవేటు ట్రావెల్స్‌కు చెందిన బస్సులో బుక్ చేసుకున్నారు. సాధారణ రోజుల్లో మూడు టికెట్లకు కలిపి రూ.2,100 వరకు అవుతుంది. దసరా పండగ రోజుల్లో అదనంగా రూ.2,400 చెల్లించాల్సి వచ్చింది.

☛ నూజివీడుకు చెందిన మంజుల హైదరాబాద్‌లో ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారు. ఆమె చదివే కళాశాలకు దసరా సెలవులు ఇవ్వడంతో కొద్ది రోజుల క్రితం తన స్వగ్రామానికి రైలులో వచ్చారు. ఈనెల 13తో సెలవులు ముగుస్తాయి. 14న కళాశాలకు వెళ్లాల్సి ఉండటంతో 13వ తేదీన రైలులో ప్రయాణించడానికి టికెట్ బుక్ చేసుకోవాలనుకున్నారు. అప్పటికే టికెట్లన్నీ బుక్ అయిపోయాయి. ఆర్టీసీ బస్సుల్లోనూ అదే పరిస్థితి నెలకొంది. ఇప్పుడున్న పరిస్థితుల్లో ప్రైవేటు బస్సుల్లో ప్రయాణించాలనుకున్నారు. ఆన్‌లైన్‌లో టికెట్ బుక్ చేసుకుందామని చూసిన ఆమెకు టికెట్ ధరలు చూసి గుండె గుభేల్ మంది. నూజివీడు నుంచి హైదరాబాద్‌కు సాధారణ రోజుల్లో రూ.6.50 నుంచి రూ.800 వరకు ఉండే టికెట్ ధర కాస్తా పండగ రోజుల్లో రూ.1,500 నుంచి రూ.3,000 వరకు చేరింది. చేసేదేమీ లేకపోవడంతో పెద్ద మొత్తాన్ని చెల్లించి ప్రైవేటు బస్సులో టికెట్ బుక్ చేసుకున్నారు మంజుల.

పండగ పేరుతో అదనపు వసూళ్లు

ప్రైవేటు బస్సుల యజమానుల ఇష్టారాజ్యం



ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: ఏటా దసరా, సంక్రాంతి తదితర పండగ రోజుల్లో ప్రైవేటు ట్రావెల్స్ యజమానులు ప్రయాణికుల నుంచి ఇష్టారాజ్యంగా సొమ్ము వసూలు చేస్తున్నారు. ప్రైవేటు ట్రావెల్స్ బస్సులు లెక్కకు మిక్కిలిగా ఉన్నాయి. సాధారణ రోజుల్లో వీటికి పెద్దగా డిమాండ్ ఉండకపోవడంతో ప్రయాణికుల నుంచి నిర్ణీత మొత్తంలో సొమ్మును వసూలు చేస్తుంటారు. పండగ రోజుల్లో మాత్రం వీరిని నియంత్రించలేకపోతున్నారు. ఏ రోజుల్లోనైనా సరే ప్రయాణించే దూరాన్ని బట్టి నిర్ణయించిన టికెట్ల ధరల ప్రకారమే ప్రయాణికుల నుంచి సొమ్మును వసూలు చేయాలనేది నిబంధన. దీన్ని అతిక్రమించే వారిపై రవాణా చట్ట ప్రకారం చర్యలు తీసుకునే అధికారం రవాణా శాఖ అధికారులకు ఉంటుంది. కానీ ఆ శాఖ అధికారులు ప్రైవేటు బస్సుల యజమానులను నియంత్రించలేకపోతున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి.

ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తాం: 'రవాణా శాఖ అధికారులతో ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తాం. పండగ రోజుల్లో ప్రయాణికుల నుంచి అదనంగా ఛార్జీలు వసూలు చేస్తున్నట్లు గుర్తిస్తే సంబంధిత బస్సుల యజమానులపై కేసులు నమోదు చేస్తాం' అని ఇన్‌ఛార్జి డీటీసీ ఎండీ మదని తెలిపారు.

కొత్తవి అందుబాటులోకి వచ్చేదాకా పాతవి నిర్వహణ

దరఖాస్తుల స్వీకరణపై ప్రత్యేక దృష్టి పెట్టండి



ఎక్సైజ్ అధికారులతో మాట్లాడుతున్న ముఖేష్ కుమార్ మీనా

ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే: కొత్త మద్యం దుకాణాలు అందుబాటులోకి వచ్చేదాకా ప్రభుత్వ దుకాణాలను కొనసాగించాలని ఎక్సైజ్ శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా అధికారులను ఆదేశించారు. నూతన విధానం అమల్లోకి వచ్చాక మద్యం దుకాణాల దరఖాస్తుల ప్రక్రియ, ఇతర వ్యవహారాల్ని పరిశీలించేందుకు గురువారం ఆయన ఏలూరులోని ఎక్సైజ్ కార్యాలయానికి వచ్చారు. ఎన్ని దరఖాస్తులు అందాయి అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏలూరు నగరంలో ఎక్కువ దుకాణాలకు అనుమతులున్నందున దరఖాస్తుల స్వీకరణకు ఎక్సైజ్ పోలీసుస్టేషన్ వద్ద ఎక్కువ కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. అక్కడ ప్రత్యేకంగా సిబ్బందిని కేటాయించాలన్నారు. దరఖాస్తుల ప్రక్రియను ఎప్పటికప్పుడు గమనించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఐఎంఎల్ డిపోనకు వెళ్లి నిల్వలను పరిశీలించారు. కొత్త దుకాణాలు అందుబాటులోకి వచ్చేవరకు ప్రభుత్వ దుకాణాలకు అవసరమైన మేరకు సరఫరా చేయాలన్నారు. కొత్తవి ప్రారంభమయ్యే నేపథ్యంలో ఎక్కువ సరకు అవసరముంటుంది గనుక ఎంత కావాలో ముందుగానే ఆర్డరు పెట్టుకోవాలని డిపో మేనేజరును ఆదేశించారు. జేసీ ధాత్రిరెడ్డి, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ వి.శ్రీలత, ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ నాగప్రభుకుమార్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆవులయ్య, సీఐ దినరాజు తదితరులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరించొద్దు

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: ఆంధ్రుల ఆత్మగౌరవానికి ప్రతీక అయిన విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరించొద్దంటూ సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ఏలూరులో గురువారం నిరసన దీక్ష చేపట్టారు. వసంత మహల్ కూడలిలోని పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద చేపట్టిన దీక్షలో ఏపీ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్, డేగా ప్రభాకర్‌రావు, కాంగ్రెస్ కిసాన్ సెల్ నాయకుడు రాజనాల రామ్మోహనరావు, బీకేఎంయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు మాట్లాడారు. విశాఖ ఉక్కు



సంఘీభావం తెలుపుతున్న వివిధ సంఘాల నాయకులు

పరిశ్రమను విక్రయించే ప్రయత్నాలు విరమించుకోకపోతే ప్రజలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. దీక్షకు ఏఐటీయూసీ నేతలు రామారావు, రెడ్డి శ్రీనివాసరావు డాంగే తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి 90 కిలోల లడ్డూ



ఆకివీడు, న్యూస్‌టుడే: ఆకివీడు మండలం అప్పారావుపేట గ్రామంలో నిర్వహిస్తున్న దసరా ఉత్సవాల్లో అమ్మవారి ప్రసాదంగా ఉంచేందుకు భారీ లడ్డూ అందజేశారు. ఆకివీడులోని సిద్ధాపురం రైల్వే గేటు ప్రాంతానికి చెందిన దూళిపాళ కృష్ణ అనే భక్తుడు 90 కిలోల ప్రసాద లడ్డూను జీడి పప్పు, బాదం పప్పులతో ప్రత్యేకంగా తయారు చేయించారు. గురువారం ఉత్సవ కమిటీ సభ్యులకు అందజేశారు.

బ్రాయిలర్ ధరలు (కృష్ణాజిల్లా)

నెక్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -118 రిటైల్ ధర 140 చికెన్ విత్ స్కిన్ - 203, చికెన్ స్కిన్‌లెస్ - 231. అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 126, 135, 146 చికెన్ విత్ స్కిన్ - 246, చికెన్ స్కిన్‌లెస్ - 256.

ఏలూరులో 2వ 'వైనాట్' షోరూమ్ ప్రారంభం



షోరూమ్ ప్రారంభిస్తున్న వెంకట కృష్ణాజీ

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: వైనాట్ 34వ శాఖను, ఏలూరులో 2వ షోరూమ్‌ను గురువారం ప్రారంభించారు. ముఖ్య అతిథిగా ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ సీనియర్ జనరల్ మేనేజర్ కరాటం వెంకట కృష్ణాజీ హాజరై వసంతమహల్ కూడలిలో కొత్తగా ఏర్పాటు చేసిన షోరూమ్‌ను ప్రారంభించారు. వైనాట్ మేనేజింగ్ డైరెక్టర్ జె.వెంకటరాయుడు తదితరులు మాట్లాడారు. ప్రారంభ విక్రయాల్లో లక్కీ పాట్ ద్వారా విజేతగా నిలిచిన ఖాతాదారుకు వెంకట కృష్ణాజీ చేతులమీదుగా మిక్సర్ గ్రైండర్‌ను బహుమతిగా అందజేశారు. కార్యక్రమంలో ఎల్‌జీ బ్రాంచి మేనేజర్ కిశోర్, లాయిడ్ రీజినల్ మేనేజర్ హేమసుందర్, హయ్యర్ బ్రాంచి మేనేజర్ అరవింద శర్మ, సోనీ సీనియర్ మేనేజర్ భాస్కర్, శ్యామ్‌సంగ్, ఐఎఫ్‌బీ, బోష్, ఎంఐ, వివో తదితర సంస్థల ఏరియా మేనేజర్లు, నగర ప్రముఖులు పాల్గొన్నారు.

కోటి ఖర్చు చేసినా ఇంతేనా?




విత్తన పరీక్షలు చేస్తున్న సిబ్బంది

భీమవరం అర్బన్, న్యూస్‌టుడే: ఇది భీమవరం వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో ఉన్న సమీకృత ప్రయోగశాల భవనం. వైకాపా హయాంలో దాదాపు రూ.కోటి ఖర్చుతో దీన్ని నిర్మించారు. గత ఏడాది జులైలో అట్టహాసంగా ప్రారంభోత్సవం కూడా చేశారు. కింద వ్యవసాయ, పైన ఆక్వా ప్రయోగశాలను ఏర్పాటు చేశారు. వాటిలో ఎంతో ఖరీదైన యంత్ర పరికరాలను సమకూర్చారు. కానీ ఇప్పటికీ కనీసం నీటి వసతి లేకుండాపోయింది. నిర్మాణంలో నాణ్యత లేకపోవడంతో పలు చోట్ల బీటలు తీసింది. ప్రధాన రహదారి నుంచి ఈ భవనానికి వెళ్లేందుకు సరైన దారి కూడా లేదు. వర్షం వస్తే మోకాలి లోతు నీరు నిలిచిపోతోంది. వ్యవసాయానికి సంబంధించిన విత్తన పరీక్షలు నిర్వహించేటప్పుడు బయట నుంచి డబ్బాల్లో నీటిని తెచ్చుకోవాల్సి వస్తోంది. ఈ విషయాన్ని వ్యవసాయశాఖ ఏడీఏ శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లగా నీటి ఇబ్బందులున్న విషయం వాస్తవమేనన్నారు. నిర్మాణంలో నాణ్యత కూడా లోపించిందని తెలిపారు. అందుకే ఇప్పటి వరకు గుత్తేదారుకు సంబంధిత బిల్లుపై తాను సంతకం చేయలేదని వెల్లడించారు.



భీమవరంలో నిర్మించిన సమీకృత ప్రయోగశాల, బయటి నుంచి తెచ్చుకున్న నీటి డబ్బా

పుణ్యక్షేత్రాల దర్శనాలకు రైలు సదుపాయం కల్పించాలి



శ్రీనివాసవర్మకు వినతిపత్రం అందజేస్తున్న రైల్వే యూజర్స్ కమిటీ సభ్యుడు కుమార్

పాలకొల్లు పట్టణం, న్యూస్‌టుడే: పుణ్యక్షేత్రాల దర్శనాలకు వెళ్లేవారి కోసం రైలు సదుపాయం కల్పించాలని కోరుతూ దక్షిణ మధ్య రైల్వే విజయవాడ యూజర్స్ కమిటీ సభ్యులు జక్కంపూడి కుమార్ నరసాపురం ఎంపీ, కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మను భీమవరంలో కలిసి వినతి పత్రం అందజేసినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. కాశీ, అయోధ్య, శబరిమలైలకు ప్రత్యేక రైళ్లు, హైదరాబాద్‌కు వందేభారత్ స్లీపర్‌ట్రైన్, బెంగళూరు వారానికి రెండుమార్లు ప్రత్యేక రైలు ఏర్పాటుకు కృషి చేయాలన్నారు. చెన్నై నుంచి అహ్మదాబాద్ వెళ్లే రైలుకు విజయవాడలో కనెక్టింగ్ బోగీలను నరసాపురం నుంచి ఏర్పాటు చేయాలని కోరారు. అరుణాచలం వెళ్లేందుకు కాకినాడ-చెన్నై రైలును తిరువణ్ణామలై వరకు పొడిగించాలని వినతిపత్రంలో కోరారు. దీనిపై విజయవాడ డీఆర్‌ఎం నరేంద్రపాటిల్‌తో చర్చిస్తానని మంత్రి శ్రీనివాసవర్మ హామీ ఇచ్చారన్నారు.

5, 6 తేదీల్లో ఆర్టీసీ బస్‌పాస్ కౌంటర్ మూత

భీమవరం అర్బన్, న్యూస్‌టుడే: పాత సాఫ్ట్‌వేర్ స్థానంలో కొత్తది ఏర్పాటు చేస్తున్నందు వల్ల ఈ నెల 5, 6 తేదీల్లో భీమవరం ఆర్టీసీ బస్టాండ్‌లోని బస్‌పాస్ కౌంటరు పని చేయదని డీఎం సత్యనారాయణ మూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. తిరిగి 7వ తేదీ ఉదయం నుంచి సేవలు అందుబాటులోకి వస్తాయని వెల్లడించారు.

తల్లిని కొడుతోందని సోదరిపై కత్తితో దాడి



నిందితుడిని పట్టుకుంటున్న స్థానికులు

జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: తల్లిని వేధించడంతో పాటు తరచూ ఆమెను కొడుతున్న సోదరిపై తమ్ముడు కత్తితో దాడిచేసిన ఘటన జంగారెడ్డిగూడెంలో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. స్థానిక శ్రీనివాసపురం రోడ్డులో నివాసం ఉండే దారా ఏసోబు అనే వ్యక్తి తాపీ పనులు చేస్తూ జీవనం సాగిస్తుంటాడు. అతడితో పాటు తల్లి, భర్తతో విడిపోయిన సోదరి ఎస్తేరురాణి, ఆమె కుమార్తె కూడా ఉంటున్నారు. కొద్ది రోజులుగా ఎస్తేరు రాణి తల్లితో గొడవపడుతూ ఆమెను కొడుతోంది. గురువారం ఇద్దరి మధ్య మరోసారి వాగ్వాదం చోటుచేసుకోవడంతో తల్లిని కొట్టి ఎస్తేరు రాణి ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయింది. తాపీ పనికి వెళ్లి ఇంటికి వచ్చిన ఏసోబు ... జరిగిన విషయం తెలుసుకుని కోపోద్రిక్తుడై స్థానిక ఎల్ఐసీ కార్యాలయం రోడ్డులో సోదరి కనిపించడంతో కత్తితో ఆమెపై దాడి చేయడంతో తల, చేతికి రక్తగాయాలయ్యాయి. స్థానికులు వెంటనే అతడిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు.

పాతకక్షల నేపథ్యంలో దాడి.. ఒకరికి తీవ్ర గాయాలు..

ముదినేపల్లి, న్యూస్‌టుడే: పాత కక్షల నేపథ్యంలో చేసిన దాడిలో యువకుడికి తీవ్ర గాయాలైన ఘటన ఇది. పోలీసుల కథనం ప్రకారం.. పెనుమల్లి శివారు సింగారానికి చెందిన బి.సాయి కూలి పని చేసుకుంటూ జీవిస్తున్నాడు. బుధవారం రాత్రి గురజ సెంటరులో ఉండగా పాతకక్షల నేపథ్యంలో అదే గ్రామానికి చెందిన గోద్రు వీరబాబు కత్తితో దాడి చేశాడు. దీంతో సాయికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గుడివాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై వెంకటకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉత్సవాల వేళ విషాదం

విద్యుదాఘాతంతో ఒకరి మృతి



సుభాష్ చంద్రబోస్ (పాత చిత్రం)

చేబ్రోలు (ఉంగుటూరు), న్యూస్‌టుడే: దేవీ శరన్నవరాత్రుల సందర్భంగా తన పిల్లలతో కలిసి ఆలయాన్ని శుభ్రం చేస్తున్న వ్యక్తిని మృత్యువు విద్యుత్తు షాక్ రూపంలో కబళించింది. పండగ వేళ ఆ కుటుంబంలో తీవ్ర విషాదాన్ని నింపింది. చేబ్రోలు పోలీసులు, స్థానికులు తెలిపిన కథనం మేరకు.. చేబ్రోలుకు చెందిన తుమ్మపాల సుభాష్ చంద్రబోస్ (40) దసరా ఉత్సవాల సందర్భంగా స్థానిక పాత కోట్లమ్మ ఆలయం వద్ద శుభ్రం చేసేందుకు తన పిల్లలతో కలిసి గురువారం వెళ్లారు. నీళ్లతో ఆలయాన్ని శుభ్రం చేసేందుకు మోటారు స్విచ్ వేస్తుండగా విద్యుదాఘాతానికి గురై సుభాష్ చంద్రబోస్ అక్కడికక్కడే మృతి చెందారు. మృతుడికి భార్య లలిత, కుమారులు ఆదినారాయణ, నాగబాబు, గీతావాణి ఉన్నారు. ఆయన భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చేబ్రోలు ఎస్సై సూర్యభగవాన్ తెలిపారు.

రహదారి ప్రమాదంలో మహిళ..

బూర్గంపాడు, న్యూస్‌టుడే: రహదారి ప్రమాదంలో వివాహిత మృతి చెందిన ఘటనలో బూర్గంపాడు పోలీస్ ఠాణాల కేసు నమోదైంది. పెదరావిగూడెం గ్రామానికి చెందిన నడిపింటి సరిత(26)కు అనారోగ్యంగా ఉండడంతో ఆమె భర్త వినోద్‌కుమార్ బుధవారం రాత్రి ద్విచక్ర వాహనం మీద భద్రాచలం ఆసుపత్రికి తీసుకెళ్లారు. తిరుగు ప్రయాణంలో సారపాక వద్ద వీరి ద్విచక్ర వాహనాన్ని టూరిస్టు బస్సు ఎదురుగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సరిత అక్కడికక్కడే మృతి చెందారు. వినోద్‌కుమార్‌కు తీవ్ర గాయాలవడంతో బంధువులు ఖమ్మం ఆసుపత్రికి తరలించారు. మృతురాలి అత్త సరోజిని ఫిర్యాదు మేరకు ఎస్సై రాజేశ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అపరిష్కృత కేసులు సత్వరం పరిష్కరించాలి : ఎస్పీ

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: జిల్లాలోని పోలీస్ స్టేషన్లలో అపరిష్కృతంగా ఉన్న కేసులను వెంటనే పరిష్కరించాలని ఎస్పీ అద్నాన్ నయీం అస్మి ఆదేశించారు. గురువారం ఆయా స్టేషన్ల అధికారులతో దృశ్య మాధ్యమంలో సమీక్ష నిర్వహించారు. అదృశ్యం, పోక్సో, హత్యలు, ఇతరత్రా కేసులు కొన్నేళ్లుగా ఎందుకు పరిష్కారం కాలేదో అడిగి తెలుసుకున్నారు. వాటన్నింటి దర్యాప్తులో పురోగతి ఉండాలన్నారు. రహదారి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని, గంజాయి, నిషేధిత మాదక ద్రవ్యాల రవాణాపై నిఘా ఉంచాలని ఆదేశించారు.

వివాహిత ఆత్మహత్య

ఆకివీడు, న్యూస్‌టుడే: వివాహిత ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఎస్సై నాగరాజు తెలిపిన వివరాలు మేరకు.. ఆకివీడు పెద్దపల్లి వీధికి చెందిన ఖడ్గ నాగలక్ష్మి(37)కి కృష్ణతో 22 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి 19 ఏళ్ల కుమారుడు దుర్గారావు ఉన్నాడు. వీరు కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. ఏడాది క్రితం విజయవాడలో అంబులెన్స్ చోదకుడు జోషి అనే వ్యక్తి పరిచయం కావడంతో భర్తకు, కుమారుడికి దూరంగా ఆకివీడులోని పెద్దపల్లి వీధిలో అద్దె ఇంట్లో ఒంటరిగా ఉంటూ విజయవాడ, ఆకివీడు తిరుగుతుండేది. నాలుగు రోజుల క్రితం విజయవాడ నుంచి ఆకివీడు వచ్చిన ఆమె తనకు తెలిసిన వాళ్లతో, స్నేహితులతోనూ తన జీవితాన్ని తనే నాశనం చేసుకుని భర్తకు, కుమారుడికి దూరంగా ఉంటున్నానంటూ బాధ పడింది. కుటుంబ సభ్యులకు దూరమయ్యానని మనస్తాపానికి గురై గురువారం సాయంత్రం ఆమె అద్దెకు ఉంటున్న ఇంట్లో ఫ్యాన్‌కు చీర కట్టి ఉరేసుకుంది. ఈ విషయాన్ని ఇంటి యజమాని ఆకివీడు ఎస్సై నాగరాజుకు తెలియజేశారు. సంఘటనా స్థలాన్ని ఎస్సై పరిశీలించి కుమారుడు దుర్గారావు సమక్షంలో నాగలక్ష్మి మృతదేహాన్ని కిందకు దింపి పోస్టుమార్టం నిమిత్తం భీమవరం ప్రభుత్వం ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

ధాన్యం కొనుగోలు కోసం సదస్సులు



అధికారులకు సూచనలు చేస్తున్న రాహుల్ కుమార్‌రెడ్డి

భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: ధాన్యం కొనుగోలుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు ముందస్తుగా చేయాలని సంయుక్త కలెక్టర్ రాహుల్ కుమార్‌రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. ధాన్యం సేకరణ కమిటీ సభ్యులతో ఆయన గురువారం తన ఛాంబర్‌లో సమావేశం నిర్వహించారు. ముఖ్యంగా ధాన్యం కొనుగోళ్లపై రైతులకు మండల, గ్రామస్థాయి సదస్సులు నిర్వహించాలని సూచించారు. గత సీజన్‌లో జరిగిన లోటుపాట్లను గుర్తు చేసుకుని ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఈ సారి కొనుగోళ్లు జరిగేలా చూడాలని స్పష్టం చేశారు. గోనెసంచులు, హమాలీలు, రవాణ వాహనాల కొరత లేకుండా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు.

జగన్ సమావేశానికి జిల్లా నాయకుల డుమ్మా

ఈనాడు డిజిటల్, భీమవరం, పెనుమంట్ర, న్యూస్‌టుడే: కష్టపడే వారికి ప్రాధాన్యమిస్తాం... నష్టపోయిన వారికి తోడుగా ఉంటాం.. పిలుపునిస్తే గ్రామస్థాయి నుంచి కదలిక రావాలి.. అని జిల్లా నాయకులకు జగన్ పిలుపునిచ్చినా కొంతమంది వైకాపా నాయకులు ఆయన సమావేశాలకు దూరంగానే ఉంటున్నారు. వైకాపా అనుబంధ విభాగాల అధ్యక్షులతో తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశానికి కొంతమంది కీలక నాయకులు డుమ్మా కొట్టారు. జిల్లా కేంద్రంలోని ఓ మాజీ ప్రతినిధి ఇటీవల పార్టీ మారనున్నారనే విషయం తెలుసుకుని రాజీ కుదర్చేందుకు కాకినాడ నగర మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి వచ్చి జగన్ సమావేశానికి హాజరుకావాలని కోరినట్లు తెలిసింది. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు అన్నీ తానై నడిపించినా, ఎలాంటి గుర్తింపు ఇవ్వలేదని, ఇప్పుడెలా వచ్చేదంటూ ఆయన అన్నట్లు సమాచారం. ఎన్నికల్లో ఓటమి తర్వాత నాయకులను పలకరించేవారే లేకపోవడంతో ఇప్పటికీ మాజీలు బయటకు రావడం లేదు. తాడేపల్లిగూడెం, తణుకు, పాలకొల్లులో నాయకుల మధ్య సమన్వయం కొరవడటం, రెండుగా విడిపోవడంతో అక్కడ కూడా నాయకులు దూరంగానే ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా కీలకంగా వ్యవహరించే కొంతమంది నాయకులు, పార్టీ పరిశీలకులు, కార్పొరేటర్లు, సర్పంచులు, జడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు ఇప్పటికే కూటమి తీర్థం పుచ్చుకున్నారు. జిల్లాలో వైకాపా నాయకుల తీరు సర్వత్రా చర్చనీయాంశమయ్యింది.

చిత్రలేఖనం ఉపాధ్యాయుడి సస్పెన్షన్

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: బుట్టాయగూడెం మండలం బూసరాజుపల్లి గిరిజన గురుకుల పాఠశాల విద్యార్థినిపై అసభ్యంగా ప్రవర్తించడంతో పాటు వేధింపులకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న పొరుగు సేవల పద్ధతిన పనిచేస్తున్న చిత్రలేఖనం ఉపాధ్యాయుడు మురళీకృష్ణను విధుల నుంచి సస్పెండ్ చేసినట్లు ఏపీవో, గిరిజన సంక్షేమశాఖ ఇన్‌ఛార్జి డీడీ పీవీఎస్ నాయుడు తెలిపారు. ఈ మేరకు జేసీ, ఐటీడీఏ ఇన్‌ఛార్జి పీవో ధాత్రిరెడ్డి గురువారం ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. అంతేకాకుండా అతడిని ఉద్యోగం నుంచి తొలగించాలని గిరిజన గురుకుల విభాగానికి జేసీ సిఫార్సు చేశారన్నారు. పాఠశాల నిర్వహణపై అలసత్వంగా ఉంటున్నారని ప్రిన్సిపల్ విజయలక్ష్మిని గురుకులానికి సరెండర్ చేసి, ఆమె స్థానంలో వైస్ ప్రిన్సిపల్ లక్ష్మీకుమారిని ఇన్‌ఛార్జి బాధ్యతలపై నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు చెప్పారు.

నెక్ సూచించిన కోడిగ్రుడ్ల ధర

★ For the Information of Trade & Industry
★ గోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గ్రుడ్డు ధర రూ. 5.35 పై॥
తణుకు ఆఫీసు: 08819-224254

భీమవరం

•భీమవరం •ఉండి

వరద బాధితులకు విరాళం


ఎమ్మెల్యే రామాంజనేయులుకు నగదు అందిస్తున్న కృష్ణవేణి

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: విజయవాడ వరద బాధితుల సహాయార్థం వీరవాసరం మండల మాజీ ఎంపీటీసీ సభ్యురాలు రంగోల కృష్ణవేణి రూ.30వేలను ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులుకు అందజేశారు. ఎమ్మెల్యే కార్యాలయంలో గురువారం జరిగిన కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

భీమవరం గ్రామీణ, న్యూస్‌టుడే: రాయలం విద్యుత్తు ఉప కేంద్రం పరిధిలోని ఇండస్ట్రియల్ ఏరియా- 11కేవీ అనాకోడేరు ఫీడర్‌పై చెట్ల కొమ్మలు తొలగించే పనులు చేపడుతున్నట్లు ఈఈ వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు వాటి పరిధిలో విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు వెల్లడించారు. కొమరాడ, గొల్లమూడి, దేగాపురం, తుమ్మ గొప్ప, ఈలంపూడి, అనాకోడేరు వినియోగదారులు సహకరించాలని కోరారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

భీమవరం పట్టణం	:80085 74471	వీరవాసరం	:80085 74475
భీమవరం మండలం	:80085 74533	ఉండి	:80085 74526
ఆకివీడు	:80085 74525	పాలకోడేరు	:80085 74467
కాళ్ల	: 80085 74474		

లోసరి(భీమవరం (గ్రామీణ), న్యూస్‌టుడే

సమస్య: లోసరి పంచాయతీలో డంపింగ్ యార్డు రూ.లక్షల ఖర్చుతో నిర్మించి కొన్నేళ్లుగా నిరుపయోగంగా వదిలేశారు. మద్యం సేవించే వారికి అది అడ్డాగా మారిపోయింది. దాన్ని వినియోగంలోకి తెచ్చి గ్రామంలో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచాలి. **-రాజు, లోసరి**

సమాధానం: రెండు రోజుల్లో దాన్ని శుభ్రం చేయించి వినియోగంలోకి తెస్తాం. **-సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి**


ఎంపీడీవో జ్యోతిని శాలువాతో సత్కరిస్తున్న సిబ్బంది

చిట్టడవుల్లా పార్కు స్థలాలు
రూ.కోట్లు పోసి.. నిర్లక్ష్యంగా వదిలేసి..!

భీమవరం ఆదర్శ నగర్‌లో 1.70 ఎకరాల విస్తీర్ణంలోని పుర పాలక పార్కు ఇది. గత కౌన్సిల్ హయాంలో రూ.1.35 కోట్లు ఖర్చుచేసి అభివృద్ధి చేశారు. పచ్చదనం కోసం మరో రూ. 5 లక్షల విలువైన మొక్కలు నాటారు. తర్వాత పార్కును పర్యవేక్షించిన వారు లేరు. అధునాతన భవనాల మధ్యన చిట్టడవిలా పార్కు కనిపిస్తుంది.



భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: భీమవరంలో అధునాతన భవంతుల మధ్య ఉన్న పార్కు స్థలాలు నిరుపయోగంగా ఉన్నాయి. అయిదేళ్ల వైకాపా పాలనలో వీటిని పట్టించుకోలేదు. ఫలితంగా ఎంతో సుందరమైన పట్టణంలో ఇవి చిట్టడవుల్లా మారాయి. క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ లేకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు, విష సర్పాలకు నిలయాలుగా మారాయి. పార్కు స్థలాల్లో పలు చోట్ల రూ.12 లక్షలతో ఏర్పాటు చేసిన వ్యాయామ పరికరాలు ముళ్ల పొదల్లోకి చేరాయి.

ఖర్చులు అధికమే

● 2005లో మారుతీ నగర్ పార్కుకు రూ.10 లక్షలతో రక్షణ గోడ నిర్మించారు. 3.40 ఎకరాల విస్తీర్ణంలోని పార్కును అభివృద్ధి చేసేందుకు ఏపీ అర్బన్ గ్రీనరీ బ్యూటిఫికేషన్ గత తెదేపా హయాంలో రూ.90 లక్షలు కేటాయించింది. మహిళలు, చిన్నారులు, యువతకు ఉపయోగపడేలా తీర్చిదిద్దే ప్రణాళికలు తయారు చేశారు. ఇంతకీ ఆ పార్కును మెరక చేసేందుకు పురపాలక సాధారణ నిధులు రూ.25 లక్షలు కేటాయించినా పనులు జరగలేదు.

● ప్రయాణ సమయాల్లో ఎలా వెళ్లాలో, కాలిబాట, రహదారుల వివరాలను తెలిపే గుర్తులను తెలుసుకునేలా ట్రాఫిక్ పార్కును రూ.10 లక్షలతో హౌసింగ్ బోర్డు కాలనీలో ఏర్పాటు చేసి వదిలేశారు.

● 2005-06లో హౌసింగ్ బోర్డు కాలనీ, ఏఎస్ఆర్ నగర్‌లోని పార్కు స్థలాలకు రూ.14 లక్షలతో రక్షణ గోడలు నిర్మించారు. వంశీ కృష్ణా నగర్‌లోని పార్కు ముఖ ద్వారాన్ని అందంగా తీర్చిదిద్దేందుకు రూ.8.5 లక్షలు ఖర్చు చేసి వదిలేయడంతో పొదలతో విష సర్పాలకు నిలయమైంది.

వినియోగంలోకి తీసుకొస్తాం..

పట్టణంలోని పార్కుల న్నింటిని వినియోగంలోకి తీసుకొచ్చేందుకు ప్రణాళిక తయారు చేశాం. రక్షణ గోడలు ఉన్నచోట్ల మొక్కలు నాటించి పచ్చదనం నెలకొల్పుతాం. పార్కు స్థలాలను ఆహ్లాదకరంగా తీర్చిదిద్ది అందుబాటులోకి తీసుకొస్తాం. - కె.రామచంద్రారెడ్డి, మున్సిపల్ కమిషనర్

పట్టణంలో వార్డులు	39	జనాభా	1.63 లక్షలు	బాలలు	దాదాపు 18వేలు	పార్కులు -	12	వినియోగంలో ఉన్నది -	01

నీట్‌లో ప్రతిభ చూపిన విద్యార్థినికి సత్కారం

ఆకివీడు, న్యూస్‌టుడే: ఆకివీడు మండలం సిద్ధాపురం గ్రామానికి చెందిన రైతు భూపతిరాజు హనుమంత రాజు, బాలాదేవి కుమార్తె దివ్య అమృత 2024లో నీట్ పరీక్షలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి 720 మార్కులకు గాను 646 మార్కులు సాధించింది. రాష్ట్రంలో 762 ర్యాంకులో నిలిచింది. ఈమెకు రంగరాయ ప్రభుత్వ మెడికల్ కళాశాల (కాకినాడ)లో ఉచిత సీటు లభించింది. ఈమెను పెద్దపుల్లేటి రామ రాజు మెమోరియల్ ట్రస్ట్ (సిద్ధాపురం) చైర్మన్ కలిదిండి ఇంద్రరాజు ఆధ్వర్యంలో గురువారం ఆకివీడులోని రామరాజు పిల్లల ఆసుపత్రిలో వైద్యులు మహేశ్ వర్మ, రామకృష్ణంరాజు తదితరుల చేతుల మీదుగా ప్రత్యేకంగా అభినందించి ఘనంగా సత్కరించారు.


దివ్య అమృత, తల్లిదండ్రులను సత్కరిస్తున్న వైద్యులు మహేశ్, రామకృష్ణంరాజు

బదిలీ అయిన ఉద్యోగులకు వీడ్కోలు

వీరవాసరం, న్యూస్‌టుడే: వీరవాసరం మండలం నుంచి వివిధ ప్రాంతాలకు బదిలీపై వెళ్తున్న అధికారులు, ఇతర ఉద్యోగులకు మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది గురువారం ఘనంగా వీడ్కోలు పలికారు. వీరవాసరం ఎంపీడీవో జ్యోతి, పంచాయతీ విస్తరణ అధికారి పి.విజయసారథి, బుట్టాయగూడెం, గుడ్లవల్లేరు మండలాలకు బదిలీ అయ్యారు. వీరిని మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది శాలువాలతో సత్కరించి వీడ్కోలు పలికారు. వీరితోపాటు వివిధ పంచాయతీలకు బదిలీ అయిన పలువురు పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందిని కూడా సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ వీరవల్లి దుర్గాభవాని, ఏవో అప్పారావు, సిబ్బంది పాల్గొన్నారు.

గరగపర్రులో పోలీస్ పికెట్

పాలకోడేరు, న్యూస్‌టుడే: గరగపర్రులో శ్మశానవాటిక స్థలం వివాదంతో బుధవారం రెండు సామాజిక వర్గాల మధ్య జరిగిన ఘర్షణ నేపథ్యంలో పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేశారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా పికెటింగ్ ఏర్పాటు చేసినట్లు భీమవరం రూరల్ సీఐ బి.శ్రీనివాస్ తెలిపారు. మరో పక్క గురువారం పంచాయతీ కార్యాలయం వద్ద జరిగిన గ్రామ సభలో కూడా ఈ వివాదంపై చర్చ జరిగింది. సమస్యను సామరస్యంగా పరిష్కరించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరారు.

విశాఖపట్నం వెళ్లి పింఛన్ పంపిణీ

కాళ్ల, న్యూస్‌టుడే: కాళ్లకూరు గ్రామానికి చెందిన విలియం క్యారీ కిడ్నీ వైద్యం నిమిత్తం విశాఖపట్నం ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా మహిళా పోలీసు ఎం.రేవతి పింఛన్ రూ.10 వేలు గురువారం అందజేసినట్లు పంచాయతీ కార్యదర్శి సునీల్‌కుమార్ తెలిపారు. విలియం క్యారీ కుటుంబ సభ్యులు రేవతికి కృతజ్ఞతలు తెలిపి ఆనందం వ్యక్తం చేసినట్లు ఆయన తెలిపారు.

త్రిభువన పోషిణి.. శంకరతోషిణి


భీమవరం ఆర్యవైశ్య వర్తక సంఘ భవనంలో..


శ్రీరామపురం కూడలిలో..

భీమవరం ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: దేవీ శరన్నవ రాత్రి మహోత్సవాలు సందర్భంగా తొలిరోజు పట్టణంలో పలు అమ్మవార్ల ఆలయాలు భక్తులతో సందడిగా మారాయి. గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆలయాలు భక్తులతో కళకళలాడాయి. ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయం నుంచి శరన్నవరాత్రి వేడుకలో భాగంగా పల్లకి ఉత్సవం మేళతాళాలతో ప్రధాన రహదారి మీదుగా నిర్వహించారు. ● రెండో పట్టణం గొల్లవానితిప్ప రోడ్డులోని దుర్గాలక్ష్మి ఆలయంలో ఉత్సవాలను ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు ప్రారంభించి మాట్లాడారు. జనసేన జిల్లా అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు, ఆలయ మాజీ అధ్యక్షుడు పెన్మెత్స రమేశ్ రాజు తదితరులు పాల్గొన్నారు. ● పైవంతెన సమీపంలోని కామాక్షి అమ్మవారి ఆలయ 100వ వార్షిక మహోత్సవాల్లో భాగంగా శోభాయాత్రను ఎమ్మెల్యే రామాంజనేయులు ప్రారంభించారు. ● విజయీభవ శోభయాత్ర శ్రీవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మావుళ్లమ్మ ఆలయ కళా వేదిక ఎదుట ఎమ్మెల్యే సతీమణి పులపర్తి సత్యవాణి ప్రారంభించారు. ● భీమేశ్వరస్వామి ఆలయంలో స్వామికి విశేషాభిషేకాలు, మహిషాసురమర్దనికి సహస్రనామ కుంకుమ పూజలు నిర్వహించారు.


చిలుకూరులో ఉత్సవ కమిటీ


సోమేశ్వరుని సన్నిధిలో..



కాళ్లకూరు వేంకన్న ఆలయంలో..

ఉండి, న్యూస్‌టుడే: ఉణుదుర్రులోని ముత్యాలమ్మ బాలాత్రిపుర సుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు, రమాదేవి దంపతుల పేరిట నియోజకవర్గ ప్రజల శ్రేయస్సు కోరుతూ ఉణుదుర్రులో ప్రత్యేక పూజలు చేయించారు.

కాళ్ల, న్యూస్‌టుడే: కాళ్ల మండలం పెద అమిరం జగన్మాత కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయాభివృద్ధి నిమిత్తం ఆలయ నిర్వాహకులకు ఎమ్మెల్యే కనుమూరి రఘురామకృష్ణరాజు రూ. 20 వేలు విరాళం అందించారు. ● గునుపూడి గ్రామ దేవత ఆదిలక్ష్మి, రాజ్యలక్ష్మి, పోలేరమ్మ ఆలయంలో శరన్నవ రాత్రి మహోత్సవాల తొలిరోజు అమ్మవారు ఆదిలక్ష్మి అలంకరణలో దర్శనమిచ్చారు.

ఆకివీడు, న్యూస్‌టుడే: ఆకివీడు గ్రామ దేవతగా కొలిచే పెద్దింట్లమ్మను ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు.


ఆదిలక్ష్మిదేవి అలంకరణలో..


శృంగవృక్షంలో..

కాళ్ల, న్యూస్‌టుడే: శరన్నవరాత్రి మహోత్సవాలు సందర్భంగా కాళ్లకూరు వేంకటేశ్వరస్వామి ఆలయంలో తొలి రోజు గురువారం ఉదయం 8.34 గంటలకు కలశ స్థాపన పూజలు నిర్వహించారు.


పెదఅమిరం కనకదుర్గ సన్నిధిలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు, సర్పంచి

లారీ ఢీకొని పారిశుద్ధ్య కార్మికురాలు మృతి

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: భీమవరం పైవంతెనపై ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొట్టిన ప్రమాదంలో పారిశుద్ధ్య కార్మికురాలు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. బంగారు రవణమ్మ(56) ముప్పై ఏళ్లుగా భీమవరం పురపాలక సంఘం పారిశుద్ధ్య కార్మికురాలిగా పని చేస్తోంది. గురువారం ఉదయం చినరంగనిపాలెం పుంత నుంచి ద్విచక్రవాహనంపై కుమారుడు శివకుమార్‌తో కలిసి మస్తర్ కార్యాలయానికి వెళ్తుండగా పాలకొల్లువైపు నుంచి భీమవరం వస్తున్న లారీ ఢీకొంది. వీరిద్దరూ కింద పడిపోవడంతో లారీ చక్రాలు రవణమ్మ ఎడమ కాలిపై నుంచి వెళ్లడంతో కాలు నుజ్జయింది. తలకు గాయమైంది. చికిత్స నిమిత్తం 108 వాహనంలో భీమవరంలోని ప్రైవేటు ఆసుపత్రిలో చేర్చారు. మెరుగైన చికిత్సకు విజయవాడ తీసుకెళ్తుండగా మార్గంమధ్యలో మృతి చెందినట్లు ఫిర్యాదులో ఆమె కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. ఏఎస్సై బి.రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరికి తీవ్రగాయాలు

ఎన్నార్పీఅగ్రహారం(ఉండి), న్యూస్‌టుడే: ఉండి - భీమవరం 165వ జాతీయ రహదారిలో గురువారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒక వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటనకు సంబంధించి స్థానికులు అందించిన సమాచారం ఇలా ఉంది. పాలకోడేరు మండలం విస్సాకోడేరు గ్రామానికి చెందిన రమేశ్ పనుల కోసం ఉండి వచ్చాడు. ద్విచక్ర వాహనంపై తిరిగి ఇంటికి వెళ్తుండగా గుర్తు తెలియని కారు అతడ్ని ఢీకొని ఆగకుండా వెళ్లిపోయింది. తీవ్ర గాయాల పాలైన రమేశ్‌ను 108 వాహనంలో భీమవరంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సంఘటనా స్థలికి పోలీసులు చేరుకొని పరిశీలించారు.

వివాహిత ఫిర్యాదు

గూట్లపాడు(భీమవరం (గ్రామీణ), న్యూస్‌టుడే: తన భర్త అనుమానంతో వేధింపులకు గురి చేస్తున్నాడంటూ గూట్లపాడు గ్రామానికి చెందిన స్వాతి అనే వివాహిత ఫిర్యాదు చేసినట్లు రైటర్ మహేశ్ తెలిపారు. దాంతో పాటు అదనపు కట్నం కావాలంటూ కుటుంబ సభ్యులతో కలిసి హింసిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నట్లు వెల్లడించారు. ఆ ఫిర్యాదు ఆధారంగా ఆమె భర్త, మరిది, భర్త స్నేహితుడు, అత్త మామలపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

భీమవరం సినిమాలు

భీమవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే

శ్రీపద్మాలయ స్క్రీన్ 1	దేవర
శ్రీపద్మాలయ స్క్రీన్ 2	సత్యం సుందరం
నటరాజ్	రామ్‌నగర్ బన్నీ
కిషోర్ స్క్రీన్ 1	మత్తువదలరా 2
కిషోర్ స్క్రీన్ 2	దక్షిణ
ఏవీజీ సినిమాస్ స్క్రీన్ 1	స్వాగ్
ఏవీజీ సినిమాస్ స్క్రీన్ 2	సత్యం సుందరం
ఏవీజీ సినిమాస్ స్క్రీన్ 3	దేవర
విజయలక్ష్మి స్క్రీన్ 1	స్వాగ్
మహాలక్ష్మి స్క్రీన్ 2	కాళి

ఆటకు చోటేది?


తోలేరు జడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో గడ్డి

తోలేరు (వీరవాసరం), న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల్లో క్రీడా మైదానాల కొరత వేధిస్తోంది. మైదానాలు ఉన్న చోట అసౌకర్యాలు చుట్టుముట్టడంతో విద్యార్థులు క్రీడలు ఆడేందుకు జాగా లేక శారీరక దారుఢ్యం పొందలేకపోతున్నారు. వీరవాసరం మండలంలో మొత్తం 70 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 7 జడ్పీ ఉన్నత పాఠశాలలు కాగా మిగిలినవి ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు. ఏడు జడ్పీ ఉన్నత పాఠశాలల్లో ఐదింటికి మాత్రమే క్రీడా మైదానాలు ఉన్నాయి. మిగిలిన రెండు పాఠశాలలకు మైదానాలు లేవు. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఒక పాఠశాలకు మాత్రమే మైదానం ఉంది. క్రీడా మైదానాలున్నా ఏ ఒక్క పాఠశాల కూడా క్రీడలు ఆడేందుకు అనుకూలంగా లేదు. ఎక్కడ చూసినా వర్షపునీరు నిలిచిపోవడం, ఆక్రమణలకు గురి కావడం, పిచ్చిమొక్కలు గడ్డి పెరిగిపోయి నిరుపయోగంగా ఉన్నాయి. ఎంఈవో 2 ఎం. శ్రీమన్నారాయణ మాట్లాడుతూ మైదానాలను అభివృద్ధి చేసేందుకు ఉన్నతాధికారులతో చర్చిస్తానన్నారు.

పంట కాలువలో అవరోధాల తొలగింపు


కాలువలో చెత్త తొలగిస్తున్న లస్కర్లు

ఉండి, న్యూస్‌టుడే: ఉండి ప్రధాన పంట కాలువలో సాగు నీటి ప్రవాహానికి అవరోధంగా మారిన చెత్త ప్రక్షాళన పనులు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. ఎన్నార్పీ అగ్రహారంలోని కాలిబాట వంతెన, ఉండి పెద్ద వంతెన కూడలిలో ఈ పనులు డెల్టా తాత్కాలిక లస్కర్లు తొలగించారు. ఉండి ప్రధాన వంతెనకు దిగువున ఏర్పాటు చేసిన పైపులైన్లు ఎగువ నుంచి వస్తున్న చెత్తాచెదారాలకు అవరోధాలుగా మారుతున్నాయని జలవనరులశాఖ సిబ్బంది తెలిపారు. పంట కాలువకు పూర్తిస్థాయిలో నీరందిస్తున్న సమయాల్లో ఈ రకమైన ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెప్పారు. వంతెన రెయిలింగ్‌కు సమాంతరంగా పైపు లైన్లు ఏర్పాటు చేసుకుంటే సాగునీటి ప్రవాహానికి ఎటువంటి సమస్యలు తలెత్తవని జలవనరుల శాఖ అధికారులు వివరించారు.

అధికారుల సూచనలు పాటించండి

అయిభీమవరం, కోళ్లపర్రు (ఆకివీడు), న్యూస్‌టుడే: ఆకివీడు మండలంలోని అయిభీమవరం, కోళ్లపర్రు గ్రామాల పరిధిలో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా గ్రామాల పరిధిలో వరి చేలను పరిశీలించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుడు శ్రీనివాసరావు, వ్యవసాయ అధికారి ప్రియాంక మాట్లాడుతూ కొల్లేరు వరద కారణంగా నష్టపోయిన రైతులకు పరిహారం నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లోనే ప్రభుత్వం జమ చేసిందని చెప్పారు. ముంపు అనంతరం వరి చేలను ఆశిస్తున్న తెగుళ్లు, పిచికారీ చేయాల్సిన మందులు, తీసుకోవాల్సిన నివారణ చర్యలను రైతులకు వివరించారు. వ్యవసాయ శాఖ అధికారులు సూచనలు పాటిస్తూ తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో మండల పశు వైద్యాధికారిణి భార్గవి సత్య, కనుమూరి రామకృష్ణంరాజు, రామారావు తదితర రైతులు పాల్గొన్నారు.



అయిభీమవరం: కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, రైతులు

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ వ్యతిరేకిస్తూ దీక్షలు

భీమవరం వన్‌టౌన్, న్యూస్‌టుడే: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ఉక్కు పరిరక్షణ కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా గురువారం భీమవరం ప్రకాశంచౌక్ వద్ద ప్రజా సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన మూడు రోజుల దీక్ష గురువారం కొనసాగింది. జిల్లా వ్యకాసం కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ, అఖిల భారత అగ్రగ్రామిక కిసాన్ సభ రాష్ట్ర అధ్యక్షుడు లంక కృష్ణమూర్తి, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి వైవీ ఆనంద్‌లు మాట్లాడుతూ 32 మంది ఆంధ్రుల ప్రాణ త్యాగంతో నిర్మితమైన విశాఖ ఉక్కు పరిశ్రమను మోదీ ప్రభుత్వం ప్రైవేటుపరం చేయడానికి చూస్తున్నా రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు కూడా లేదన్నారు. దండు శ్రీనివాసరాజు, రైతు సంఘం నాయకుడు చల్లబోయిన వెంకటేశ్వరరావు, కౌలు రైతు సంఘం నాయకులు పిల్లి కామేశ్వరరావులు మాట్లాడుతూ విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోకపోతే రానున్న రోజుల్లో ఉద్యమాలను ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు.



నినాదాలు చేస్తున్న నాయకులు

ఇంట్లో ఎవరూ లేని సమయంలో చోరీ

ఉండి, న్యూస్‌టుడే: ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి చోరీకి పాల్పడిన సంఘటనపై ఆలస్యంగా అందిన ఫిర్యాదు ఆధారంగా ఉండి పోలీసులు గురువారం రాత్రి కేసు నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. ఉండి కాపులపేటలోని చెన్నంశెట్టి వారి వీధిలో నివాసం ఉంటున్న నేరెళ్ల సతీశ్‌బాబు ఈ ఏడాది మే నెల 23న ఇంటికి తాళాలు వేసి కుటుంబ సభ్యులతో కలిసి ఊరెళ్లాడు. అదే నెల 25న ఒక ఎలక్ట్రీషియన్ తనకు ఫోన్ చేసి మీ ఇంటి తాళాలు పగలగొట్టి ఉన్నాయని సమాచారమిచ్చాడని బాధితుడు వివరించారు. తిరిగొచ్చి ఇంట్లోకి ప్రవేశించి పరిశీలించగా 4 గ్రాములు బంగారం, 100 గ్రాముల వెండి వస్తువులు, రెండు చరవాణులు చోరీకి గురయ్యాయని బాధితుడు సతీశ్ బాబు ఫిర్యాదు ఇచ్చారు.

విజేతలకు పతకాలు అందజేత


గెలుపొందిన క్రీడాకారులతో నిర్వాహకులు


భీమవరం గునుపూడి, న్యూస్‌టుడే: మహాత్మాగాంధీ జయంతి పురస్కరించుకుని జిల్లా సర్వోదయ మండలి ఆధ్వర్యంలో ఈ నెల 2, 3 తేదీల్లో సీనియర్ సిటిజన్స్‌కు నిర్వహించిన 'గాంధీ ఖేల్ షటిల్ బ్యాడ్మింటన్' పోటీల్లో విజేతలకు బహుమతులు అందించినట్లు కార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు తెలిపారు. గురువారం శ్రీరామపురం కూడలి సమీపంలో ఉన్న గాంధీ కస్తూర్బా ప్రాంగణంలో పట్టణ స్థాయిలో పోటీలు నిర్వహించామన్నారు. విన్నర్స్‌గా టి.రమేశ్, వై.కిరణ్, రన్నర్స్‌గా ఎ.శివాజీరాజు, ఎం.శ్రీనివాస్‌లకు మండలి నిర్వాహకులు ప్రశంసా పత్రాలు, పతకాలు అందించినట్లు తెలిపారు.

పీఎంశ్రీ పథకంపై అవగాహన

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: ప్రధానమంత్రి స్కూల్ ఫర్ రైజింగ్ ఒకేషనల్ శిక్షణలో భాగంగా విద్యార్థినులకు అవగాహన కార్యక్రమాన్ని గురువారం భీమవరంలో నిర్వహించారు. పీఎంశ్రీ పథకంలో ఎంపికైన విద్యార్థినులకు వస్త్ర దుకాణాలకు తీసుకెళ్లి రిటైల్ రంగ వ్యాపారం గురించి వివరించారు. ప్రధానోపాధ్యాయుడు పి.బి.శ్రీనివాసరావు, ఒకేషనల్ శిక్షకుడు కె.రాంజీ అంబేడ్కర్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యలు తీరేదెప్పుడో?

శుభ్రతకు నోచుకోని ఓవర్‌హెడ్ ట్యాంకులు




ఇది భీమవరం మండలం బేతపూడి పంచాయతీ ఓవర్ హెడ్ ట్యాంకు. దీనికి ఉన్న మెట్లు విరిగిపోయి ఏళ్లు గడిచిపోయింది. ఈ ట్యాంకును శుభ్రం చేసి పదమూడేళ్లయింది. అంటే ఇక్కడ పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. చెరువులో నీటిని నేరుగా కుళాయిల ద్వారా సరఫరా చేస్తున్నారని ఇక్కడి ప్రజలు వాపోతున్నారు. కొంత మందైతే తాడేరు గ్రామం వెళ్లి టిన్నుల్లో నీటిని తెచ్చుకుంటున్నారు.

భీమవరం గ్రామీణ, న్యూస్‌టుడే

పల్లె ప్రజలకి స్వచ్ఛమైన తాగునీరు అనేది అందని ద్రాక్షగా మారింది. పాలకులు ఎన్ని హామీలు ఇచ్చినా వాటిని అమలు చేయాల్సిన అధికారులు కనిపించడం లేదు. జల జీవన్ మిషన్ నిధులు పుష్కలంగా ఉన్నా ఇప్పటికీ అధిక శాతం గ్రామాల్లో ప్రజలు శుద్ధి చేసిన నీరు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఓవర్‌హెడ్ ట్యాంకులను శుభ్రం చేయడంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని జిల్లా కలెక్టర్ నాగరాణి ఆదేశించినా వాటిని పాటించే ఉద్యోగులు పంచాయతీల్లో కనిపించడం లేదు. శుభ్రం చేసి ఐదేళ్లు, పదేళ్లు దాటిన ట్యాంకులు ఎన్నో ఉన్నాయి.

భీమవరం నియోజకవర్గంలోని భీమవరం, వీరవాసరం మండలాల్లో మొత్తం 48 పంచాయతీలు ఉన్నాయి. ఇప్పటికీ అధిక శాతం గ్రామాల్లో జలజీవన్ మిషన్ లక్ష్యాలు నెరవేరలేదు. ఎల్‌వీఎన్‌పురం గ్రామస్థులకైతే నేరుగా కాలువ నీటిని సరఫరా చేస్తున్నారు. తుందుర్రులో ఒక కోటి వ్యయంతో ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మించినా ఇప్పటికీ అది ప్రారంభానికి నోచుకోలేదు. బేతపూడి, యనమదుర్రు, నాగిడిపాలెం, తోకతిప్ప, కొత్తపూసలమూరు, గూట్లపాడు, గొల్లవానితిప్ప, రాయకుదురు, అండలూరు, బాలేపల్లి, బొబ్బనపల్లి తదితర గ్రామాల్లో నీటి సమస్యలు తీవ్రంగా ఉన్నాయి.



ఇది భీమవరం మండలం తోకతిప్ప పంచాయతీలోని ఓవర్‌హెడ్ ట్యాంకు. దీనికి ఉన్న మెట్లు శిథిలమై చాలా కాలమైంది. ప్రస్తుతం దీన్ని వినియోగించకుండా వదిలేశారు. ఫిల్టర్ బెడ్‌లో శుభ్రం చేసిన నీటిని వెంట వెంటనే కుళాయిల ద్వారా ప్రజలకి సరఫరా చేస్తున్నామని ఇక్కడ అధికారులు చెబుతున్నారు. ఇక్కడ తాగునీటి సమస్య పరిష్కారంపై అధికారులు, పాలకులు దృష్టి పెట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

శుభ్రం చేయిస్తాం..

ఓవర్‌హెడ్ ట్యాంకులు తరచూ శుభ్రం చేస్తూనే ఉన్నాం. క్షేత్రస్థాయి పరిశీలన చేసి ఇంకా శుభ్రం చేయనివి ఉంటే శుభ్రం చేయించి క్లోరినేషన్ చేయిస్తాం. - కనకారావు, గ్రామీణ నీటి సరఫరా విభాగం ఏఈ, భీమవరం

నరసాపురం

• నరసాపురం • పాలకొల్లు • ఆచంట

విశాఖ ఉక్కు అమ్మకాన్ని ప్రజలు వ్యతిరేకించాలి



సిద్ధాంతంలో నిరసన తెలుపుతున్న నాయకులు

పెనుగొండ గ్రామీణ, న్యూస్‌టుడే: విశాఖ ఉక్కు అమ్మకాన్ని ప్రజలందరూ వ్యతిరేకించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం పిలుపునిచ్చారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను వ్యతిరేకించాలని కోరుతూ గురువారం సిద్ధాంతంలో సీపీఎం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి, కవిరి సెంటర్‌లో ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సీపీఎం నాయకులు చింతకాయల బాబూరావు, పీవీ ప్రతాప్, కౌరు పెద్దిరాజు, మాజీ ఎమ్మెల్యే దిగుపాటి రాజగోపాల్, కేతా గోపాలన్ తదితరులు పాల్గొన్నారు.

బహుళ ప్రయోజనం ఉండే పనులు గుర్తించాలి



కోమటితిప్ప సమావేశంలో మాట్లాడుతున్న ఏసు

మొగల్తూరు, న్యూస్‌టుడే: ఉపాధి పథకంలో గుర్తించే పనులతో రైతులకు, కూలీలకు ప్రయోజనం ఉండే పనులు గుర్తించాలని సర్పంచులు సూచించారు. మండలంలోని గ్రామాల్లో 2024- 25 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి పథకం చేపట్టనున్న పనుల గుర్తింపుపై గురువారం సర్పంచుల అధ్యక్షతన గ్రామసభలు నిర్వహించారు. మొగల్తూరులో సర్పంచి పడాల మేరీసత్యనారాయణ, కోమటితిప్పలో పులపర్తి ఏసు, కొత్తోటలో పడాల సత్యనారాయణ, పేరుపాలెంనార్త్‌లో పేరుపాలెం వెంకన్న, ముత్యాలపల్లిలో అడ్డాల సూరిబాబు తదితరుల అధ్యక్షతన గ్రామసభలు నిర్వహించారు.

తహసీల్దారుగా రాజకిశోర్



మొగల్తూరు, న్యూస్‌టుడే: మొగల్తూరు తహసీల్దారుగా కె.రాజకిశోర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ నియమితులైన సీహెచ్ విద్యాపతి బాధ్యతలు స్వీకరించిన 52 రోజుల్లో తూర్పుగోదావరి జిల్లాకు బదిలీ చేయించుకుని వెళ్లారు. ఆయన స్థానంలో ఎన్టీఆర్ జిల్లా వీరులపాడు నుంచి రాజకిశోర్‌ను ప్రభుత్వం ఇక్కడ నియమించింది. ఈ సందర్భంగా ఆయనకు కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛం అందించారు.



ఇలపర్రులో పంపిణీ చేస్తున్న నాయకులు

ఎలుకల మందు పంపిణీ

పెనుగొండ గ్రామీణ, న్యూస్‌టుడే: రైతులంతా ఐక్యంగా పనులు చేపట్టినప్పుడే సత్ఫలితాలు వస్తాయని తెదేపా సీనియర్ నాయకుడు కేతా సత్తిబాబు అన్నారు. ఇలపర్రు పంచాయతీ వద్ద గురువారం ఎలుకల నిర్మూలన మందు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇలపర్రు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ★ ఉపాధి హామీ పనులు గుర్తించేందుకు గురువారం ఇలపర్రు పంచాయతీ వద్ద గ్రామ సభ నిర్వహించారు.

అంకిత భావంతో పని చేస్తేనే గుర్తింపు

నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: విధి నిర్వహణలో అంకిత భావంతో పనిచేస్తేనే ఉద్యోగి జీవితానికి సార్థకత అని ఎంపీడీవో వీకే వీరభద్రరావు అన్నారు. నరసాపురం మండలం నుంచి బదిలీ అయిన ఈవోపీఆర్డీ జి.ఆంజనేయ శర్మ, మండల పరిషత్ సిబ్బంది వాసు, శ్రీరామ్, గ్రామ కార్యదర్శి బెనర్జీ గ్రామ సచివాలయ సిబ్బందికి గురువారం రాత్రి మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన వీడ్కోలు, అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.



బదిలీపై వెళ్తున్న ఉద్యోగులు

ఇక చెత్త పన్ను ఊసే లేదు..!

పట్టణ ప్రజలపై తగ్గిన భారం

పాలకొల్లు పట్టణం, న్యూస్‌టుడే

❖ గత వైకాపాది చెత్త ప్రభుత్వం. చెత్త మీద పన్ను వేశారు గాని వ్యర్థాలను తొలగించలేదు. కావాలని ఆ చెత్తను దుకాణాల ముందు వేశారు. జగన్ ప్రభుత్వం నిర్వాకంతో రాష్ట్రంలో 85 లక్షల టన్నుల చెత్త పేరుకుపోయింది. దీన్ని ఏడాదిలో తొలగించాలని పురపాలకశాఖామంత్రి నారాయణను ఆదేశించాం. రాష్ట్రంలో చెత్త పన్ను ఇక నుంచి వసూలు చేయవద్దని అధికారులను ఆదేశిస్తున్నాం. - ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు



చెత్త సేకరిస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

❖ కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే చెత్తపై పన్ను వసూళ్లు నిలిపివేస్తామని తెదేపా అధినేత చంద్రబాబునాయుడు, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఇచ్చిన హామీని గాంధీ జయంతి సందర్భంగా అక్టోబర్ నుంచి అమలు చేశారు. వైకాపా ప్రభుత్వం అధికారంలో వచ్చిన రెండో సంవత్సరం నుంచే యూజర్ ఛార్జీల పేరిట చెత్త పన్ను విధించింది. పట్టణంలో 14,831 నివాసాలు ఉన్నాయి. పేదల కాలనీల్లో నెలకు రూ.50, ఇతర ప్రాంతాల్లో రూ.100, వాణిజ్య ప్రాంతాల్లో రూ.300 చొప్పున వసూలు చేశారు.

డబ్బు దుర్వినియోగం..

వైకాపా ప్రభుత్వం అధికారంలో ఉండగా కొత్తకొత్త దోపిడీ పథకాలను అమలు చేశారు. వాటిలో చెత్త పన్ను ఒకటి. అప్పటి వరకు ఉన్న చెత్త సేకరణ విధానాన్ని కాదని క్లీన్ ఆంధ్రప్రదేశ్ (క్లాప్) పేరుతో 2021 అక్టోబర్‌లో ఇళ్ల నుంచి చెత్త సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించింది. దీని కోసం ఏజెన్సీలను ఎంపిక చేసింది. వారే వాహనాలను సమకూర్చి చోదకులను నియమించుకొనేలా ఒక్కో వాహనానికి నెలకు రూ.56,934 చొప్పున చెల్లించింది. 19 వాహనాలకు ప్రతి నెలా రూ.10.81 లక్షలు చొప్పున ఏజెన్సీకి చెల్లించారు. ఆ మొత్తం ప్రజల నుంచి ముక్కు పిండి వసూలు చేశారు. చెత్త పన్ను రూపేణ వచ్చిన సొమ్ములు సరిపోకపోతే మున్సిపల్ సాధారణ నిధుల నుంచి ఏజెన్సీకి చెల్లించి డబ్బులు దుర్వినియోగం చేశారు.

పన్నుల ప్రభుత్వానికి మంగళం..



కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే చెత్త పన్ను వసూళ్లు నిలిపివేస్తామని ప్రకటించిన నాటి నుంచే చెత్త పన్ను కట్టడం మానేశాం. అధికారులు కూడా ఒత్తిడి చేయడం లేదు. దీనివల్ల ప్రతి ఇంటికి ఏటా రూ.600 నుంచి రూ.1200 వరకు భారం తగ్గింది. ప్రతిదానికి పన్ను వేస్తూ ప్రజలను కొల్లగొట్టడమే వైకాపా ప్రభుత్వ లక్ష్యంగా పాలన సాగించింది. అడిగితే కక్షసాధింపు చర్యలకు పాల్పడింది. పన్నుల ప్రభుత్వానికి ప్రజలు మంగళం పాడారు. - పోకల సాయి

భారం పోయింది..



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఇచ్చిన హామీని నెరవేర్చడంతో పేద, మధ్యతరగతి ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. చెత్తపై పన్ను వసూలు చేసిన మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చరిత్రలో నిలిచిపోయారు. - చినిమిల్లి గణపతిరావు

వసూళ్లు మానేశాం..



చెత్త పన్నుపై మొదటి నుంచి ప్రజల్లో వ్యతిరేకత ఉంది. ఎన్నికల ముందు మరింతగా వ్యతిరేకించి పన్ను కట్టడం మానేశారు. అధికారుల మౌఖిక సూచనల మేరకు జూన్ నెల నుంచే వసూళ్లు పూర్తిగా మానేశాం. ఇప్పుడు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్పష్టమైన ఆదేశాలిచ్చారు.

- బి.విజయసారథి, మున్సిపల్ కమిషనర్, పాలకొల్లు

మేమున్నాం.. మీకు తోడుగా..

10 AM to 1 PM

నరసాపురం: 80085 74504
పాలకొల్లు: 80085 74510
ఆచంట : 91212 29087

పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే

సమస్య: స్థానిక అగ్గుగట్టుపాలెం పాత బ్యాంకుకాలనీ నుంచి కొత్త కాలనీకి వెళ్లే మార్గంలో గత కొంతకాలంగా చెత్త శుభ్రం చేయడం లేదు. - రాము, స్థానికుడు

సమాధానం: పరిశీలించి చర్యలు తీసుకుంటాం. - దావీదు రాజు, పారిశుద్ధ్య అధికారి

పెనుగొండ, న్యూస్‌టుడే

సమస్య: వడలిలో పలు ప్రాంతాల్లో దోమలు విజృంభిస్తున్నాయి. దోమల నివారణకు పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టాలి. - బొజ్జిలి అప్పారావు, వడలి

సమాధానం: పారిశుద్ధ్య సిబ్బందితో దోమల మందు పిచికారీ చేయిస్తాం. - పి.అచ్యుతరామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి, వడలి

స్పందనకు సంతసం

పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే: స్థానిక సూర్యతేజ నగర్‌లో విద్యుత్తు స్తంభానికి పాదులు అల్లుకున్నాయని స్థానికులు 'ఈనాడు' నిర్వహిస్తున్న 'మేమున్నాం.. మీకు తోడుగా..'కు చెప్పగా ఈ నెల 3వ తేదీన ప్రచురితమైంది. దీనిపై విద్యుత్‌శాఖ ఏఈ బాబ్జీ స్పందించి గురువారం సిబ్బందితో పాదులను శుభ్రం చేయించారు.

యాజమాన్యం సంజాయిషీతో పరిష్కారం



కళాశాల ప్రతినిధులతో మాట్లాడుతున్న హిందూ సంఘాల సభ్యులు

నరసాపురం, న్యూస్‌టుడే: దీక్షలో ఉన్న విద్యార్థిని పరీక్ష రాసేందుకు పాఠశాల యాజమాన్యం అభ్యంతరం వ్యక్తం చేసిన ఘటన గురువారం పట్టణంలో చోటుచేసుకుంది. దీనికి సంబంధించి స్థానికులు, విద్యార్థి కుటుంబ సభ్యులు తెలిపిన సమాచారం మేరకు పట్టణానికి చెందిన విద్యార్థి కె.చక్రవర్తి జె సికిలి విద్యాసంస్థలో ఆరో తరగతి చదువుతున్నాడు. విద్యార్థి ఇటీవల భవానీ దీక్ష తీసుకున్నారు. పాఠశాల నిర్వహించే పరీక్ష రాసేందుకు చక్రవర్తి వెళ్లాడు. మాలతీసి రావాలని సంస్థ ప్రతినిధులు పరీక్ష రాయకుండా చక్రవర్తిని అడ్డుకున్నారు. సమాచారం తెలిసిన ఆ విద్యార్థి కుటుంబ సభ్యులు, హిందు ధార్మిక సంఘాల ప్రతినిధులు పాఠశాలకు వెళ్లి ఆందోళన చేపట్టారు. దీంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. సంస్థ ప్రతినిధులు విద్యార్థి కుటుంబ సభ్యులకు, ధార్మిక సంఘాల సభ్యులకు సంజాయిషీ చెప్పి పరీక్షకు అనుమతించడంతో సమస్య పరిష్కారమైంది. సమాచారం అందుకున్న మండల విద్యాశాఖ అధికారి పి.పుష్పరాజ్యం పాఠశాలకు వెళ్లి వివరాలు సేకరించారు. ఘటనకు సంబంధించి నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తామని ఎంఈవో 'న్యూస్‌టుడే'కు తెలిపారు.

జైలు జీవితం నుంచి విముక్తి కల్పించాలని వినతి



కేంద్రమంత్రి శ్రీనివాసవర్మకు వినతిపత్రం అందజేస్తున్న మాధవనాయుడు

నరసాపురం, న్యూస్‌టుడే: బ్రతుకుదెరువు కోసం గల్ఫ్‌దేశం వెళ్లి అక్కడ జరిగిన రహదారి ప్రమాదంతో జైలుపాలైన యువకుడికి విముక్తి కల్పించి ఇంటికి చేర్చేందుకు కృషి చేయాలని కోరుతూ కేంద్రమంత్రి భూపతి రాజు శ్రీనివాసవర్మకు మాజీ ఎమ్మెల్యే బండారు మాధవనాయుడు గురువారం వినతిపత్రం అందించారు. రామన్నపాలేనికి చెందిన యాతం నాగేశ్వరరావు కుమారుడు జీవా ఉపాధి నిమిత్తం అయిదేళ్ల కిందట సౌదీ అరేబియా డ్రైవర్‌గా వెళ్లాడు. అక్కడ జరిగిన రహదారి ప్రమాదంలో ఒక వ్యక్తి మృతిచెందడంతో అక్కడి న్యాయస్థానం జీవాకు రూ.50 లక్షలు అపరాధ రుసుము విధించింది. జీవా కుటుంబానికి అంత నగదు చెల్లించే ఆర్థిక స్తోమత లేకపోవడంతో అక్కడ జైలులో మగ్గుతున్నాడు. జీవాకు జైలు జీవితం నుంచి విముక్తి కల్పించి కుటుంబ సభ్యుల చెంతకు చేర్చేందుకు కృషి చేయాలని జీవా తండ్రితో కలిసి ఇచ్చిన వినతిపత్రంలో కోరారు.

పొలంగట్టున పాఠం వింటుంటే!



యలమంచిలి, న్యూస్‌టుడే: ప్రభుత్వం రైతుల కోసం ప్రవేశపెట్టిన పొలం పిలుస్తోంది కార్యక్రమం యలమంచిలి మండలం నార్నిమెరక, కట్టుకాల్వ గ్రామాల్లో గురువారం జరిగింది. మండల వ్యవసాయాధికారి దేవి, ఆయా గ్రామాల సర్పంచులు, రైతులు పచ్చని పొలం గట్టున బరకాలు పరుచుకుని ఒక్క చోటున కూర్చుని అధికారులు చెబుతున్న సూచనలు వింటున్న చిత్రం చూడముచ్చటగా కనిపించింది.

దారంతా గుంతలు.. నిత్యం అవస్థలు



వారతిప్ప- వెంప మార్గంలో దిగబడిన లారీ

మొగల్తూరు మండలం వారతిప్ప నుంచి భీమవరం గ్రామీణ మండలం వెంప వెళ్లే ఆర్‌అండ్‌బీ రహదారి ప్రమాదాలకు నిలయంగా మారింది. రోడ్డు పొడవునా ఏర్పడిన గుంతల్లో వాననీరు నిలిచి ఉంటుంది. ఆ ప్రాంతంలో నేల స్వభావం దిగబడేలా ఉండటంతో సరకు రవాణా వాహనాలు తరచూ దిగబడటమో.. అదుపుతప్పి కాలువలోకి వెళ్లడమో జరుగుతోంది. నరసాపురం, భీమవరం పట్టణాల్లోని పలు విద్యాలయాలకు విద్యార్థులను చేరవేసే బస్సులు, నిత్యం వేలాది ద్విచక్ర వాహనాలు, రైతులు ఈ మార్గంలోనే రాకపోకలు సాగిస్తుంటారు. వారతిప్ప, వెంప తదితర గ్రామాల్లోని ఆక్వా ఉత్పత్తులు, చెరువులకు మేతలు తదితర వాటిని ఇటుగానే రవాణా చేస్తుంటారు. మొగల్తూరు నుంచి వెంప వెళ్లే ఆర్‌అండ్‌బీ రహదారి కూడా ఇదే పరిస్థితిలో ఉండటంతో వాహనచోదకులు వారతిప్ప- వెంప మార్గంలో ప్రయాణిస్తున్నారు. ఈ పరిస్థితిపై ఆర్‌అండ్‌బీ డీఈ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ రహదారికి అత్యవసర మరమ్మతులకు ప్రభుత్వం రూ.25 లక్షలు మంజూరు చేసిందని చెప్పారు.

- న్యూస్‌టుడే, మొగల్తూరు

జగన్మాతా.. దీవించవమ్మా



పెనుగొండ: శ్రీబాల అలంకరణలో మహిషాసురమర్దని అమ్మవారు



పెనుమంత్ర మండలం నెగ్గిపూడిలో..



పాలకొల్లు: కోడుగట్టు వేదికపై..


ఆచంట, పాలకొల్లు, నరసాపురం నియోజకవర్గాల్లోని అన్నిగ్రామాల్లో దేవీ శరన్నవరాత్రులు ప్రారంభమయ్యాయి. మొదటి రోజు గురువారం పలు ఆలయాలు, కూడళ్ల వద్ద ఏర్పాటు చేసిన వేదికలపై అమ్మవారి విగ్రహాలను ప్రతిష్ఠించారు. కలశస్థాపన చేసి శాస్త్రోక్తంగా పూజలు జరిపించారు. పాలకొల్లు పట్టణం క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు బాలా త్రిపుర సుందరీదేవిగా దర్శనమిచ్చారు. మాజీ ఎమ్మెల్సీలు అంగర రామమోహన్, మేకా శేషుబాబు, తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆచంట, పెనుగొండ, పెనుమంత్ర, నరసాపురం, మొగల్తూరు తదితర ప్రాంతాల్లో ఉత్సవాలను అట్టహాసంగా ప్రారంభించారు. - న్యూస్‌టుడే, బృందం



క్షీరారామంలో బాలా త్రిపుర సుందరీదేవి అలంకరణలో...



ఉల్లంపర్రులో..



రాయపేట: పుంతలో ముసలమ్మ

ప్రాయశ్చిత్త దీక్ష విరమణ



సిద్ధాంతంలో దీక్ష విరమణ చేస్తున్న గోవింద స్వాములు

పెనుగొండ గ్రామీణ, న్యూస్‌టుడే: పవన్‌కల్యాణ్ దీక్షకు మద్దతుగా సిద్ధాంతం గ్రామంలో వేంకటేశ్వరస్వామివారి ఆలయ అర్చకులు పెద్దింటి శేషాచార్యులు ఆధ్వర్యంలో 11 రోజుల పాటు 11 మంది గోవింద స్వాములు మాలలు ధరించి ప్రాయశ్చిత దీక్ష, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఆచంట (మార్టేరు), న్యూస్‌టుడే: ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ దీక్షకు మద్దతుగా వల్లూరు విజయదుర్గాదేవి ఆలయంలో నాలుగో రోజైన గురువారం భజన కార్యక్రమం నిర్వహించారు.

8 నుంచి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు



మాట్లాడుతున్న గాంధీ భగవాన్‌రాజు

పాలకొల్లు పట్టణం, న్యూస్‌టుడే: కాస్మోపాలిటన్ స్పోర్ట్స్‌క్లబ్, టౌన్‌హాల్ సంయుక్త ఆధ్వర్యంలో పాలకొల్లు కాస్మోక్లబ్ ప్రాంగణంలో రాష్ట్రస్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు జరుగుతాయని క్లబ్ అధ్యక్షుడు జి.గాంధీ భగవాన్‌రాజు తెలిపారు. స్థానిక కాస్మోక్లబ్ ప్రాంగణంలో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 8, 9 తేదీల్లో అండర్-8, 10, 12, 14 విభాగాల్లో బాలబాలికలకు రాష్ట్రస్థాయి సింగిల్స్, డబుల్స్ షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో కాస్మో కార్యదర్శి వి.వి.సోమరాజు, కోశాధికారి రుద్రరాజు రమేష్‌రాజు, వైస్ ప్రెసిడెంట్ రుద్రరాజు సత్యనారాయణ రాజు, క్షత్రియ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు చెరుకూరి సూరిబాబు, టోర్నమెంట్ డైరెక్టర్ వీరవల్లి మోహన్‌కల్యాణ్‌కుమార్, ఆర్గనైజింగ్ కమిటీ ఛైర్మన్ గొట్టుముక్కల శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

విద్యార్థినులకు బహుమతులు



క్రీడల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థినులకు ప్రోత్సాహక బహుమతులు అందజేసిన వాకర్స్ సభ్యులు

పాలకొల్లు పట్టణం, న్యూస్‌టుడే: స్థానిక దాసరి నారాయణ రావు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు క్రీడల్లో రాణించడం హర్షనీయమని వాకర్స్‌క్లబ్ అధ్యక్షుడు తటవర్తి సుధాకర్ అన్నారు. నరసాపురం వైఎన్ కళాశాలలో ఇటీవల జరిగిన జిల్లాస్థాయి షటిల్ పోటీల్లో ప్రథమస్థానం, ఖోఖోలో ద్వితీయస్థానం సాధించిన విద్యార్థులకు ప్రత్యేక బహుమతులు అందజేశారు. అనంతరం విజయల్యాబ్ సహకారంతో విద్యార్థులకు బ్లడ్‌గ్రూప్ నిర్ధారణ పరీక్షలు చేశారు. ప్రిన్సిపల్ శోభారాణి, విజయల్యాబ్ అధినేత కొమ్ముల మురళీకృష్ణ, క్లబ్ సభ్యులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

చిన్నారులకు ఆర్థిక ఆసరా..!

మిషన్ వాత్సల్యతో లబ్ధి



పాలకొల్లు ప్రాజెక్టు పరిధిలో లబ్ధిదారులతో వివిధ శాఖాధికారులు

ఆచంట, మార్టేరు, న్యూస్‌టుడే: ప్రతి బిడ్డకు ఆనందకర, ఆరోగ్యకరమైన బాల్యాన్ని ఇవ్వాలన్న ఆలోచనతో రాష్ట్ర ప్రభుత్వం భాగస్వామ్యంతో కేంద్రం మిషన్ వాత్సల్య పథకాన్ని అమలు చేస్తోంది. తల్లిదండ్రులను కోల్పోయి నిస్సహాయులైన చిన్నారులకు ఈ పథకం ద్వారా నెలవారీ ఆర్థిక సాయం అందిస్తారు. 2022లో కేంద్రం ఈ పథకాన్ని ప్రకటించి అమలుకు ఆదేశాలు ఇవ్వగా అప్పటి వైకాపా ప్రభుత్వం లబ్ధిదారులను ఎంపిక చేసి సాయం అందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించింది. తాజాగా అధికారంలోకి వచ్చిన ఎన్డీయే ప్రభుత్వం ఈ పథకంపై పూర్తిస్థాయి దృష్టి సారించి అర్హత ఉన్న వారందరికీ సాయం అందించేందుకు అవసరమైన నిధులు అందించింది. దీంతో ఆరు నెలలకు సంబంధించి సొమ్ములు ఖాతాలకు జమయ్యాయి.

ప్రాజెక్టు	వచ్చిన దరఖాస్తులు	గుర్తించిన అర్హుల సంఖ్య
పెనుమంత్ర	1174	49
పాలకొల్లు	1149	69

వడబోసి.. ఎంపిక...

ఈ పథకంలో భారీ సంఖ్యలోనే దరఖాస్తులు వచ్చాయి. గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో వీటిని స్వీకరించారు. వాటిని ప్రాజెక్టు, ఆ తర్వాత జిల్లా కార్యాలయానికి పంపారు. వివిధ దశల్లో పరిశీలన అనంతరం లబ్ధిదారులను ఎంపిక చేశారు. వచ్చిన దరఖాస్తుల సంఖ్యలో 10 శాతం కూడా ఈ పథకానికి అర్హత పొందలేకపోయారు. దరఖాస్తు చేయడంలో లోపాలు, సరైన పత్రాలు సమర్పించకపోవడం వంటి కారణాలతో పలువురు ఈ పథకానికి దూరమయ్యారు. అమ్మఒడి ద్వారా లబ్ధి పొందుతున్న వారు ఈ పథకానికి అనర్హులుగా గుర్తించారు.

కేంద్రం 60...రాష్ట్ర 40 శాతం వాటా

ఈ పథకం అమలుకు కేంద్రం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులు సమకూరుస్తున్నాయి. ఎంపికైన లబ్ధిదారులకు నెలకు రూ.4 వేలు చొప్పున చెల్లిస్తున్నారు. తల్లిదండ్రులిద్దరినీ కోల్పోయిన, తల్లి లేదా తండ్రిని పోగొట్టుకున్న 18 ఏళ్ల లోపు చిన్నారులకు ఈ సాయం అందిస్తున్నారు. తొలి విడతలో 2003 ఏప్రిల్ నుంచి 2023 జులై వరకు రూ.24 వేలను వారి ఖాతాలకు జమ చేశారు.

❖ గుర్తించిన అర్హుల వ్యక్తిగత బ్యాంకు ఖాతాలకు ఆరునెలలకు సంబంధించి సొమ్ము జమ చేసినట్లు ఐసీడీఎస్ పెనుమంత్ర ప్రాజెక్టు సీడీపీవో అంగర కృష్ణకుమారి తెలిపారు.

విద్యుత్తు సరఫరాలో అంతరాయం

ఆచంట (మార్టేరు), న్యూస్‌టుడే: వల్లూరు విద్యుత్తు ఉపకేంద్రం పరిధిలోని నీరుల్లిపాలెం, వల్లూరు లోకల్ ఫీడర్స్ నిర్వహణ పనుల రీత్యా శుక్రవారం పలు గ్రామాలకు సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఆ శాఖ నరసాపురం ఈఈ బి.సురేష్‌కుమార్ తెలిపారు. వల్లూరు, నీరుల్లిపాలెం, కంభోట్లపాలెం, పోడూరు మండలం వద్దిపర్రు గ్రామాలకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు సరఫరా ఉండదని చెప్పారు.

వసుధ ఫౌండేషన్ ఆర్థిక సహాయం

యలమంచిలి, న్యూస్‌టుడే: యలమంచిలి మండలం ఇలపకుర్రు గ్రామానికి చెందిన బి.దేవి గొంతు క్యాన్సర్‌తో బాధపడుతున్నారు. గ్రామ సర్పంచి జీవరత్నం ద్వారా వసుధ ఫౌండేషన్ ఛైర్మన్ మంతెన వెంకటరామరాజు విషయం తెలుసుకొని రూ.10వేలు చెక్కును పంపగా ఫౌండేషన్ కన్వీనర్ పి.బుద్ధరాజు దేవి భర్త విష్ణుమూర్తికి గురువారం అందజేశారు.

కలుపు మందు తాగిన యువకుడి మృతి

ఏలూరు నేర వార్తలు, న్యూస్‌టుడే: కలుపు మందు తాగి యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆచంట గ్రామం చినపేటకు చెందిన బోడా నాగరాజు (30) మద్యం ఎక్కువగా తాగుతుంటాడు. ఇతను మద్యం మత్తులో ఈ నెల 2న కలుపు మందు తాగి అస్వస్థతకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు గమనించి ఏలూరు సర్వజన ఆసుపత్రికి తీసుకురాగా చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. ఆచంట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇల్లు దగ్ధం

పాలకొల్లు గ్రామీణ, న్యూస్‌టుడే: ఇంట్లో ఎవరూ లేని సమయంలో విద్యుత్తు షార్టుసర్క్యూట్ వల్ల రేకుల షెడ్డు దగ్ధమైన ఘటన పాలకొల్లు మండలం పెద్దమామిడిపల్లిలో గురువారం చోటు చేసుకుంది. అగ్నిమాపక అధికారి వై.వి.జానకిరామ్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పరువు ఘటోత్కచుడు ఇంటిలో మంటలు రావడం చూసిన స్థానికులు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. సిబ్బంది మంటలు అదుపు చేశారు. సుమారు రూ. రెండు లక్షల ఆస్తి నష్టం ఉంటుందన్నారు.



చించినాడ ప్రధాన రహదారి మొన్నటి వరకు అలా..



మరమ్మతులతో నేడు ఇలా..

దాటుకుని కాదు దర్జాగా వెళ్తున్నారు!

చించినాడ రోడ్డుకు మరమ్మతులతో ఊరట

యలమంచిలి, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం వచ్చాక అధ్వానంగా ఉన్న ప్రధాన రహదారులకు ఇటీవల మరమ్మతులు చేయడంతో ప్రజలకు ఊరట కలిగింది. యలమంచిలి- చించినాడ రోడ్డు నిండా గుంతలు ఉండటంతో ద్విచక్ర వాహనాల నుంచి కార్లు వరకు పక్కనున్న మార్జిన్‌లో నుంచి జాగ్రత్తగా వెళ్లేవారు. ఆయా గుంతలను చదును చేసి కంకరతో నింపడం వల్ల ఏ వాహనమైనా దర్జాగా రోడ్డు మధ్య నుంచి వెళ్తుంది.

పతకాలు అందజేత

భీమవరం గునుపూడి, న్యూస్‌టుడే: మహాత్మా గాంధీ జయంతి పురస్కరించుకుని జిల్లా సర్వోదయ మండలి ఆధ్వర్యంలో ఈ నెల 2, 3 తేదీల్లో సీనియర్ సిటిజన్స్‌కు నిర్వహించిన 'గాంధీ ఖేల్ షటిల్ బ్యాడ్మింటన్' పోటీల్లో విజేతలకు బహుమతులు అందించినట్లు కార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు తెలిపారు. గురువారం శ్రీరామపురం కూడలి సమీపంలో ఉన్న గాంధీ కస్తూర్బా ప్రాంగణంలో పట్టణ స్థాయిలో పోటీలు నిర్వహించామన్నారు. విన్నర్స్‌గా టి.రమేశ్, వై.కిరణ్, రన్నర్స్‌గా శివాజీరాజు, శ్రీనివాస్‌లకు మండలి నిర్వాహకులు ప్రశంసా పత్రాలు, పతకాలు అందించినట్లు తెలిపారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి



మార్టేరులో పంట పరిశీలిస్తున్న జ్యోషిలా

మార్టేరు, న్యూస్‌టుడే: వరి పంటను ఆశించే తెగుళ్ల విషయంలో రైతులు అప్రమత్తంగా ఉండి తగిన సస్యరక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయాధికారి ఎ.జ్యోషిలా సూచించారు. మండలంలోని మార్టేరు, నెగ్గిపూడి గ్రామాల్లో గురువారం పొలం పిలుస్తోంది.. కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం పంటలో ఎండాకు తెగులు ప్రభావం కనిపిస్తుందన్నారు. చిరు పొట్ట దశలో ఉన్న పొలాలకు పొటాష్ ఎరువు వేయాలని తెలిపారు. సామూహిక ఎలుకల నిర్మూలనలో భాగంగా శుక్రవారం గ్రామాల్లో రైతులకు ఉచితంగా మందు అందజేస్తామని చెప్పారు. అనంతరం క్షేత్రస్థాయి పరిశీలన చేశారు.

వరిలో యాజమాన్య పద్ధతులపై అవగాహన.. నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: వరి సాగులో రైతులు ఆధునిక పద్ధతులు పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధించాలని ఏడీఏ ఇ.అనిల్ కుమారి అన్నారు. పొలం.. పిలుస్తోంది.. కార్యక్రమంలో భాగంగా చినమామిడిపల్లి రైతులకు గురువారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. డ్రోన్‌ల ద్వారా పురుగు మందును పొలాల్లో పిచికారీ చేయడం ద్వారా అధిక పెట్టుబడిని తగ్గించుకోవచ్చునని వివరించారు.

తాడేపల్లిగూడెం
•తాడేపల్లిగూడెం •తణుకు

18న రాష్ట్ర సదస్సు


కర పత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: ఈ నెల 18న విజయవాడలో నిర్వహించే ఏఐటీయూసీ రాష్ట్ర సదస్సు విజయవంతం చేయాలని జిల్లా సహాయ కార్యదర్శి మామిడి దానవరప్రసాద్ విజ్ఞప్తి చేశారు. స్థానిక శేషమహల్ కూడలిలో సదస్సు కరపత్రాలు గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రం ఐదేళ్లలో తీసుకొచ్చిన కార్మిక వ్యతిరేక చట్టాలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోళ్లు

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఇబ్బందులు లేకుండా చూస్తామని జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్లరావు అన్నారు. కృష్ణాయపాలెంలో గురువారం తాడేపల్లిగూడెం సహాయ వ్యవసాయ సంచాలకుడు మురళీకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు.


కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేశ్వరరావు, రైతులు తదితరులు

మానసిక ఆరోగ్యంపై తరగతులు

తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రపంచ మానసిక ఆరోగ్య వారోత్సవాల్లో భాగంగా ఈ హెప్పో కమలాకర్స్ మైండ్ అండ్ పర్సనాలిటీ కేర్ ఆధ్వర్యంలో ఈ నెల నాలుగు నుంచి పదో తేదీ వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు సైకాలజిస్టు రమేష్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తణుకు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఉచితంగా తరగతులు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

ఆర్టీసీ సిబ్బందికి సత్కారం

తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే: పరిశుభ్రతపై ఆర్టీసీ సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించి కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని 'మానవత' సేవా సంస్థ సభ్యులు కొనియాడారు. ఆర్టీసీ సిబ్బందిని గురువారం డిపో ఆవరణలో సత్కరించారు. డిపో మేనేజర్ సప్తా గిరిధర్ కుమార్, మానవత సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: హౌసింగ్ బోర్డు ఉప విద్యుత్తు కేంద్రం పరిధిలో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నరసింహమూర్తి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు ఈ విషయాన్ని గ్రహించి అధికారులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

ఆవిష్కరణలకు ఐఈఈఈ చక్కని వేదిక

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: ఆవిష్కరణలను తీర్చిదిద్దడానికి ఐఈఈఈ చక్కని వేదికని ఏపీ నిట్ అసోసియేట్ డీన్ డాక్టర్ సందీప్ పేర్కొన్నారు. స్థానిక ఏపీ నిట్ ప్రాంగణంలో ఐఈఈఈ దినోత్సవం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ఎంతోమంది అనుభవజ్ఞులైన ఆచార్యులు, నిపుణులైన ఇంజినీర్లు ఇందులో సభ్యులుగా ఉన్నారని పేర్కొన్నారు. పరిశోధనల విషయంలో ఎదురయ్యే సమస్యలను వారితో నిరంతరం చర్చించి ఉత్తమ పరిశోధనలుగా మలుచుకోవచ్చన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

తణుకు మున్సిపల్ కమిషనర్‌కు స్వచ్ఛతా హీ సేవా అవార్డు

తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే: స్వచ్ఛతా హీ సేవా 2024 అవార్డు తణుకు మున్సిపల్ కమిషనర్ ఎన్.రామ్‌కుమార్ అందుకున్నట్లు గురువారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. మచిలీపట్నంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ఈ అవార్డు అందుకున్నట్లు తెలిపారు.

తాళం వేసిన ఇళ్లే లక్ష్యం..!

- దసరా సెలవుల్లో జరభద్రం
- అందుబాటులో సాంకేతిక సేవలు

ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్ అండగా..

పెంటపాడు, తాడేపల్లిగూడెం టూటౌన్, న్యూస్‌టుడే

దసరా సెలవులు వచ్చాయి. విహార యాత్రలు, సొంతూళ్లు, బంధువుల ఇళ్లకు వెళ్లేందుకు సన్నద్ధమవుతున్నారా..? అయితే జర జాగ్రత్త.. ఇదే అదనుగా దొంగలు కూడా మాటువేసి ఉన్నారు. తాళాలు వేసిన ఇళ్లే లక్ష్యంగా చోరీలకు పాల్పడుతున్నారు. గతంలో దసరా పండగకు పలు ఇళ్లల్లో చోరీలు జరిగిన ఘటనలు ఉన్నాయి. నగదు, విలువైన బంగారం, వెండి వస్తువులు మాయమయ్యాయి. ముందస్తు జాగ్రత్తలు తీసుకోకపోవడంతో కొందరు తీవ్రంగా నష్టపోయారు.

■ రెండేళ్ల కిందట దసరా సెలవుల్లో తాడేపల్లిగూడెం హౌసింగ్‌బోర్డులోని ఓ ఇంట్లో దొంగలు పడి రూ.లక్ష నగదు, 25 కాసుల బంగారం అపహరించుకుపోయారు. పెంటపాడు మండలం దర్శిపర్రులో రూ.15 లక్షల విలువైన బంగారం దొంగలు దోచుకెళ్లారు.



■ సంవత్సరం కిందట దసరా సెలవుల్లో కడకట్ల లోని ఓ ఇంట్లో రూ.ఐదు లక్షల విలువైన బంగారు ఆభరణాలు, రూ.50 వేల నగదు అపహరణకు గురయ్యాయి.



సాంకేతిక పరిజ్ఞానంతో ఇళ్లల్లో దొంగతనాల్ని అడ్డుకునేందుకు ఏర్పాటు చేసిన వ్యవస్థే లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్ (ఎల్‌హెచ్‌ఎంఎస్) యాప్. గత తెదేపా ప్రభుత్వ హయాంలో రాష్ట్ర పోలీసుశాఖ దీనిని అందుబాటులోకి తెచ్చింది. అన్ని పట్టణాల్లో అమలు చేస్తున్నారు. ఇల్లు విడిచి కొన్ని రోజులపాటు దూరంగా ఉండేవారు స్థానిక పోలీస్ స్టేషన్‌లో సంప్రదిస్తే ఆ ఇంట్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్ అనుసంధానం చేస్తారు. తాళం వేసి ఉన్న ఇంటి తలుపు ఎవరైనా తీసినా.. చోరీకి అవకాశమున్న వెంటనే ఆ యాప్ పోలీసులను అప్రమత్తం చేసి క్షణాల్లో వారు అక్కడకు చేరేలా చేస్తుంది. ఈ యాప్‌ను సెలవుల్లో ఎక్కువమంది వినియోగించుకోవడం ద్వారా ఇంటిని భద్రంగా ఉంచుకోవచ్చు. ప్రస్తుతం సీసీ కెమెరాలు అందుబాటు ధరల్లో లభిస్తున్నాయి.

వీటిని మరవద్దు..
- ఇళ్లలో దొంగతనాలు జరగకుండా ఉండాలంటే పోలీసులు కొన్ని సూచనలు చేస్తున్నారు.
- సాంకేతిక పరిజ్ఞానంతో ఇంటి చుట్టూ నిఘా ఉంచుకోవాలి.
- ఊరు వెళ్తున్నట్లు గస్తీ పోలీసులకు సమాచారం ఇవ్వాలి.
- ఇరుగు పొరుగువారికి సమాచారం ఇచ్చి తమ ఇంటిపై ఒక కన్నేసి ఉంచమని చెప్పాలి.
- ఇంటికి తాళం కనిపించకుండా కర్టెన్ అడ్డు వేయాలి.
- ఇంట్లో ఎప్పుడు బల్బు వెలిగి ఉండేలా చూసుకోవాలి.

'చోరీల నివారణకు లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్ (ఎల్‌హెచ్‌ఎంఎస్) యాప్ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి. వీధుల్లో ఎవరైనా అనుమానంగా సంచరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలి. చోరీల నివారణకు పోలీసుశాఖ ప్రత్యేక చర్యలు చేపడుతుంది.' అని సీఐ సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

తాడేపల్లిగూడెం	79950 67078
పెంటపాడు	79939 36123
తణుకు గ్రామీణ	85558 50851
అత్తిలి	91548 46774

10 AM to 1 PM

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే

సమస్య: సుబ్బారావుపేట ముత్తకపల్లి వారి వీధి కూడలిలో రహదారిపై మురుగునీరు చేరి ఛిద్రంగా మారుతోంది. - వెంకట రమణ, స్థానికుడు

సమాధానం: పరిశీలించి మురుగుబోదెను బాగు చేయిస్తాం. - శ్రీమన్నారాయణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్

సమస్య: తాడేపల్లిగూడెం పట్టణం కడకట్ల హెచ్‌పీగ్యాస్ గోదాము రోడ్డులో కుక్కల సంచారంతో స్థానికులు భయభ్రాంతులకు గురవుతున్నారు. - విజయ్, స్థానికుడు.

సమాధానం: కుక్కల సంచారాన్ని అరికట్టేలా చర్యలు చేపడతాం - ఏసుబాబు, పురపాలక కమిషనర్

తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే

సమస్య: స్థానిక మహిళా కళాశాల వెనుక ఉన్న కాలనీలో సరైన మురుగు కాలువ వ్యవస్థ లేక ఇబ్బందులు పడుతున్నారు. - సుధాకర్, స్థానికుడు

సమాధానం: పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థ మెరుగు పరిచేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం. - రామ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్

సమస్య: తణుకు నుంచి తాడేపల్లిగూడెం వెళ్లే రహదారి గోతులు పడి రాకపోకలు సాగించేందుకు వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. - సత్యవతి, తణుకు

సమాధానం: మరమ్మతులకు నిధులు మంజూరయ్యాయి. త్వరలో పనులు చేపడతాం. - రవి బాబు, ర.భ శాఖ ఏఈ

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ

పెంటపాడు, న్యూస్‌టుడే: తాడేపల్లిగూడెం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో పోషకాహార లోపంతో చిన్నారులు బలహీనంగా మారుతున్నారు. ఈ నెల 2న 'ఈనాడు'లో 'బక్కచిక్కుతున్న బాల్యం' శీర్షిక కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన ఐసీడీఎస్ సీడీపీవో సరస్వతి గురువారం సూపర్‌వైజర్లతో నియోజకవర్గంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలు తనిఖీ చేయించారు. తప్పకుండా కిచెన్‌గార్డెన్ నిర్వహించాలని, స్థలం లేని చోట కుండీల ద్వారా మొక్కలు వేసి కూరగాయలు పండించాలని అంగన్‌వాడీ నిర్వాహకులకు ఆదేశాలిచ్చారు.

చురుగ్గా వరి కోతలు

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే: తాడేపల్లిగూడెం గ్రామీణ మండలంలో వరికోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. ముందస్తుగా పంట వేసిన స్వల్పకాలిక 126 రకాన్ని గురువారం మాసూళ్లు చేస్తున్నారు. బంగారుగూడెం, వీరంపాలెం, పెద్దిపాలెం, కొమ్ముగూడెం, కృష్ణాయపురం, అప్పారావుపేట, కడియద్ద, చినతాడేపల్లి, పెదతాడేపల్లి తదితర గ్రామాల్లో మాసూళ్ల ప్రక్రియ చురుగ్గా సాగుతోంది.



ఉచిత వైద్య శిబిరం

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో డైమండ్స్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత మధుమేహ నిర్ధారణ శిబిరాన్ని గురువారం నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడు రమణ శిబిరాన్ని ప్రారంభించారు. 120 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. పేరిచర్ల మురళీ తదితరులు పాల్గొన్నారు.



పీకేస్తున్నా పట్టించుకోరా..!



తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: వీధి కుక్కల స్వైరవిహారంతో తాడేపల్లిగూడెం పట్టణ ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. రహదారులపై యథేచ్ఛగా సంచరిస్తున్న వీటిని చూస్తూ ప్రాణాలను అరచేతుల్లో పెట్టుకుని తిరుగుతున్నారు. తీవ్రత పెరుగుతున్న దృష్ట్యా నెలకొంది. పట్టణంలోని 35 వార్డుల్లో ఎనిమిది వేలకు పైగా వీధి కుక్కలు ఉన్నట్లు అంచనా. ప్రతి రోజూ పదుల సంఖ్యలో కుక్క కాటు కేసులు నమోదవుతున్నా యంత్రాంగం చర్యలు చేపట్టకపోవడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



★ డాగ్స్ మిషన్స్ సెంటర్లు ఏర్పాటు చేసి కుక్కల సంతతిని నియంత్రించే శస్త్ర చికిత్సలు చేయాల్సి ఉండగా ఆదిశగా ఎక్కడా అమలు కావడం లేదు. గత అయిదేళ్లలో ఒక్క కుక్కకు కూడా ఈ ప్రక్రియ నిర్వహించలేదు.

'కుక్కల బెడద నివారణకు చర్యలు తీసుకోవాలి. వీటి కారణంగా చిన్నారులను ఒంటరిగా విడవలేకపోతున్నాం. పెద్ద వాళ్ళైతం వీటిని చూసి హడలిపోవాల్సి వస్తోంది. గుంపులుగా తిరుగుతూ భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి.' అని పట్టణానికి చెందిన సుధాకర్ వాపోయారు.

పట్టణ జనాభా	1.20 లక్షలు
వార్డులు	35
ఈ ఏడాది నమోదైన కుక్కకాటు కేసులు (ఇప్పటి వరకు)	2,483

ఉద్యోగులకు సన్మానం

ఉంగుటూరు, న్యూస్‌టుడే: సాధారణ బదిలీల్లో భాగంగా ఇతర ప్రాంతాలకు బదిలీ అయిన ఉద్యోగులను గురువారం ఘనంగా సత్కరించారు. నిడమర్రుకు బదిలీ అయిన ఇన్‌ఛార్జి తహసీల్దారు బొద్దేపల్లి దుర్గాప్రసాద్‌ను మండల కోఆప్షన్ సభ్యులు ఘనంగా సత్కరించారు. నారాయణపురం, కైకరం పంచాయతీ కార్యదర్శులు జవ్వాది నాగేశ్వరరావు, నాగేంద్రకుమార్‌లను ఆయా గ్రామాల సర్పంచులు దిద్ది అలకనంద, సలగాల గోపి, పంచాయతీ పాలకవర్గ సభ్యులు సన్మానించారు.

ఎక్కడి చెత్త అక్కడే!

రేలంగి, తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణాలు, పల్లెలు పరిశుభ్రంగా ఉండాలనే ఉద్దేశంతో స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమాలు నిర్వహించారు. గత నెల 17న మొదలు పెట్టి 15 రోజుల పాటు గ్రామాల్లో రోజుకో విధమైన కార్యక్రమం చొప్పున నిర్వహించారు. కానీ వీధుల్లో చెత్త కుప్పలు మాత్రం తొలగలేదు. రహదారులు, కాలువల పక్కనే వ్యర్థాలు నేటికీ దర్శనమిస్తున్నాయి. దీంతో స్వచ్ఛ సంకల్పం కాగితాలకే పరిమితమవుతోంది. గాంధీ ఆశయాల ఆచరణలోకి తెచ్చే విధంగా ప్రధాని మోదీ స్వచ్ఛ భారత్‌కు 2014లో శ్రీకారం చుట్టారు. అప్పటి నుంచి ఏటా ప్రత్యేక పరిశుభ్రత కార్యక్రమాలు చేపడుతున్నారు. వీటికి ఎన్నికోట్లు సర్కారు అత్యంత ప్రాధాన్యమిచ్చింది. కానీ క్షేత్ర స్థాయిలో అధికారుల మాత్రం ఆ మేర దృష్టి సారించడం లేదు.

మండలం	పంచాయతీలు	సంపద కేంద్రాలు
తణుకు	9	9
ఇరగవరం	21	21
అత్తిలి	18	16


రేలంగిలో ఇందిరానగర్ వద్ద రహదారి పక్కనే చెత్త


కొమరవరంలో..

తూతూమంత్రంగా కార్యక్రమాలు

పదిహేను రోజుల పాటు ప్రతి మండలంలో 'స్వచ్ఛతా హీ సేవ' కార్యక్రమం నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. రోజుకో కార్యక్రమం చొప్పున అవగాహన ర్యాలీలు, ప్లాస్టిక్ వినియోగం, కలుషిత నీరు ఇలా రోజుకో అంశం చొప్పున 15 రోజులు నిర్వహించారు. క్షేత్రస్థాయిలో పటిష్టంగా అమలు చేయాల్సిన అధికారులు పేరుకు మాత్రమే నిర్వహించి మమ అనిపించారు. దీని ప్రభావంతో ఎక్కడి చెత్త అక్కడే ఉండిపోయింది. ఉన్నతాధికారుల ఆదేశాలు బేఖాతరు చేయకుండా నామమాత్రంగా స్వచ్ఛత కార్యక్రమాలు నిర్వహించారన్న విమర్శలు ఉన్నాయి.

ఆనందరూపిణి.. వరప్రదాయిని

తాడేపల్లిగూడెం అర్బన్, పట్టణం, వన్‌టౌన్, పెంటపాడు, తణుకు గ్రామీణం, అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే: దేవీ శరన్నవరాత్రుల మహోత్సవాలు పురస్కరించుకుని పెంటపాడు మండలం, తాడేపల్లిగూడెం టూటౌన్ పరిధిలోని పలు ఆలయాల్లో పండగ శోభ సంతరించుకుంది. తొలి రోజు అమ్మవారిని విశేషంగా అలంకరించి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ★ ప్రత్తిపాడు పై కూడలిలోని కనకదుర్గమ్మ దేవస్థానంలో వార్షికోత్సవం సందర్భంగా అమ్మవారిని స్వర్ణ కవచాలంకృత దుర్గాదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ★ ప్రత్తిపాడు శివారు కాగులంపాడులో కనకదుర్గ ఆలయంలో వార్షికోత్సవం సందర్భంగా స్వర్ణ కవచాలంకృత దుర్గాదేవిగా అలంకరించారు. ★ కప్పాపెంటపాడు గ్రామంలోని భైరాగిమఠం గోపాలస్వామి ఆంజనేయస్వామి దేవస్థానంలో అమ్మవారి కలశస్థాపన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి రవిశంకర్ అర్చకులు త్రిలోచన్‌దాస్, పూర్ణచంద్ర త్రిపాఠి పాల్గొన్నారు. పెంటపాడుతల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు గుండం సతీష్, సర్పంచి పీతల సత్యనారాయణ, నరాలశెట్టి సంతోష్, పంతం శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

★ పుర దేవత బలుసులమ్మ అమ్మవారి దేవస్థానంలో దసరా మహోత్సవాలు గురువారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు బాలా త్రిపుర సుందరిగా దర్శనమిచ్చారు. ★ ఉత్తర్వ ★ వాసవీ కన్యకా పరమేశ్వరి బాలా త్రిపుర సుందరిగా, శంకరమఠంలో సర్వమంగళ అమ్మవారిని వెండి, బంగారు ఆభరణాలతో అలంకరించారు. ★ వీరంపాలెంలోని శ్రీ బాలాత్రిపుర సుందరి పంచాయతన క్షేత్రంలో అమ్మవారిని విశేషంగా అలంకరించారు.


ముత్యాలమ్మ


బాలా త్రిపుర సుందరి అలంకరణలో బలుసులమ్మ


వాసవీ మాత


సర్వమంగళ అమ్మవారు

ఆలయ వ్యవస్థాపకులు గరిమెళ్ల వెంకటరమణ సిద్ధాంతి కార్యక్రమాలను పర్యవేక్షించారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. ★ మండపాక యల్లారమ్మ ఆలయంలో వద్ద కలశస్థాపనతో ఉత్సవాలు ప్రారంభించారు. బాల త్రిపుర సుందరిగా యల్లారమ్మను అలంకరించారు. ★ వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ ప్రాంగణంలో కామాక్షి అమ్మవారు రాజరాజేశ్వరిగా దర్శనమిచ్చారు.

రజత కవచధారిగా ముత్యాలమ్మ..

ముత్యాలంపాడులో శ్రీముత్యాలమ్మ దేవస్థానంలోని రజత కవచదేవిగా ముత్యాలమ్మ భక్తులకు దర్శనమిచ్చారు. పట్టణానికి చెందిన కొట్టు నారాయణరావు కుమారుడు కొట్టు నాగభూషణం రూ.1.20 లక్షలతో నిర్మించిన యాగశాలను దేవస్థానం అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు భవానీరాజు ప్రారంభించారు. ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, తాడేపల్లిగూడెం నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జి వలవల బాబ్జి అమ్మవారిని దర్శించుకుని విశేష పూజలు చేశారు. కార్యక్రమంలో ఈవో హరేరామప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

★ అత్తిలి, మంచిలి, పాలూరు, కొమ్మర, ఈతకోట, స్కిన్నెరపురం, ఆరవల్లి, దంతులూరు, ఉనికిలి గ్రామాల్లో మహిళా భక్తులు మండపాలు ఏర్పాటు చేసి అమ్మవారిని కొలువు దీర్చారు.

షిర్డీ సాయిబాబా మందిరంలో ఉత్సవాలు

ఏలూరు రోడ్డులోని శ్రీ షిర్డీ సాయిబాబా మందిరంలో పుణ్యతిథి ఉత్సవాలను ఈ నెల 12 వరకు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

భీమేశ్వరరావు సేవలు ఎనలేనివి

పెంటపాడు, న్యూస్‌టుడే: పెంటపాడు గ్రామ సర్పంచిగా జామి భీమేశ్వరరావు అందించిన సేవలు ఎనలేనివని మాజీ జడ్పీటీసీ సభ్యుడు, తెదేపా మండల అధ్యక్షుడు కిలపర్తి వెంకట్రావు అన్నారు. గురువారం వెలమ యువజన సంఘం భవనం వద్ద జామి భీమేశ్వరరావు వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కిలపర్తి వెంకట్రావు వృద్ధులకు పండ్లు, మజ్జిగ పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పెంటపాడు గ్రామాభివృద్ధిలో భీమేశ్వరరావు చెరగని ముద్ర వేశారన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ డైరెక్టర్ దాసరి అప్పన్న, బండారు వెంకట్రావు, రవికిరణ్, జీవీ రమేష్, గాదాపు సతీష్, క్రాంతికుమార్, కర్రి శివ, బంగారయ్య చిటికల గోపీ, తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' పనులపై గ్రామసభ

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే: గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా అన్ని పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహించారు. ఆయా పంచాయతీల్లో జరగాల్సిన పనులు గుర్తించారు. కొత్త పనులను ఏ విధంగా చేయాలనే దానిపై చర్చించారు. సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ఎంపీటీసీలు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సంచుల కొరత తలెత్తకూడదు

ఉంగుటూరు, న్యూస్‌టుడే: ధాన్యం సేకరణలో గోనె సంచుల కొరత లేకుండా చర్యలు చేపట్టాలని ఆర్డీవో అచ్యుత్ అంబరీశ్ సూచించారు. ఉంగుటూరు తహసీల్దారు కార్యాలయంలో పలు అంశాలపై రెవెన్యూ, వ్యవసాయ శాఖలు, పౌరసరఫరాల సంస్థ అధికారులతో గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ కొనుగోళ్లు ప్రారంభించే నాటికి అవసరమైన గోనె సంచులను సమకూర్చుకోవాలన్నారు. ఆధార్, కుల తదితర ధ్రువీకరణ పత్రాల జారీలో జాప్యం లేకుండా చూడాలన్నారు. గ్రామాల్లో రెవెన్యూ సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. ఇన్‌ఛార్జి తహసీల్దార్ బొద్దేపల్లి దుర్గాప్రసాద్, ఏవో ఎస్.ప్రవీణ్‌కుమార్, ఆర్ఐ దావీదు రాజు, డీటీ స్వర్ణదుర్గ తదితరులు పాల్గొన్నారు.

'ఎస్సీ వర్గీకరణ చేస్తే ఉద్యమిస్తాం'

తాడేపల్లిగూడెం టూటౌన్, న్యూస్‌టుడే: ఎస్సీ వర్గీకరణ చేస్తే మాలలంతా ఏకమై ఉద్యమిస్తామని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటి మిల్లి మంగరాజు అన్నారు. గురువారం హౌసింగ్ బోర్డులో మాల సంఘాల ఐకాస నాయకుల ఆత్మీయ సమావేశం మంగరాజు అధ్యక్షతన జరిగింది. ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ నవంబరు నుంచి తెలుగురాష్ట్రాల్లో సింహగర్జన సభలు నిర్వహిస్తామన్నారు. బేతా శరత్‌బాబు, ఫ్రాన్సిస్ రాజు, కాంతారావు, జయరాజు, బొంత శ్యామ్, గంపల సత్యకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలికి ఆశ్రయం

రాజమహేంద్రవరం సాంస్కృతికం: తాడేపల్లిగూడెం మండలం జగన్నాథపురానికి చెందిన తుమ్మిడి నాగరత్నం అనే 75 ఏళ్ల వృద్ధురాలు పుష్కరాల రేవులో ఆత్మహత్యకు యత్నించడంతో ఆమెను చిరు వ్యాపారులు కాపాడి మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. పోలీసుల విన్నపం మేరకు రెండురోజుల క్రితం లాలాచెరువులోని స్వర్ణాంధ్ర వృద్ధుల సేవా సంస్థ నిర్వాహకులు ఆశ్రయం కల్పించినట్లు సంస్థ నిర్వాహకులు గుబ్బల రాంబాబు చెప్పారు. బాధిత మహిళ నాగరత్నం వివరాల ప్రకారం.. భర్త మూడేళ్ల క్రితం చనిపోవడంతో నాగరత్నం ఒంటరిగా ఉంటున్నారు. ఈమెకు ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె. వయసు మీద పడటం, ఆయనవారి ఆదరణ కరువై ఆత్మహత్యకు యత్నించారు. కుటుంబ సభ్యులు ఎవరైనా వస్తే వారికి వృద్ధురాలిని అప్పగిస్తామని రాంబాబు చెప్పారు.


దాడి కేసులో నలుగురిపై కేసు

అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే: అత్తిలి మండలం ఈడూరు ఉప్పరగూడెంలో మహిళపై దాడి కేసులో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలు.. ఈడూరు ఉప్పరగూడెంకు చెందిన సంధ్యాల రామలక్ష్మి కుటుంబానికి అదే గ్రామానికి చెందిన సంధ్యాల రాముడు కుటుంబానికి ఇంటి సరిహద్దు విషయంలో తగాదాలున్నాయి. ఈ నెల 2న దీనిపై గొడవ జరిగింది. రామలక్ష్మిని సంధ్యాల రాముడు, రమణ, నాగరాజు, వెంకన్నలు తీవ్రంగా గాయపరిచి పారిపోయారు. గాయపడిన ఆమెను తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రేమరాజు తెలిపారు.

నివాసాల మధ్య మద్యం దుకాణాలొద్దు


ఏలూరు గ్రామీణం, న్యూస్‌టుడే: నూతన మద్యం విధానాన్ని సవరించాలని, నివాస ప్రాంతాల మధ్య దుకాణాలు పెట్టొద్దని కోరుతూ అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) నాయకులు ఏలూరులోని అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో పర్యవేక్షకురాలికి గురువారం వినతి పత్రం అందజేశారు. అనంతరం ఐద్వా జిల్లా కార్యదర్శి శ్యామలరాణి మాట్లాడుతూ ఇప్పటికే మద్యం కారణంగా అనేక సంసారాలు పతనమవుతున్నాయన్నారు. దుకాణాల నిర్వహణకు సమయపాలన విధించాలని, నిత్యావసర సరుకుల ధరలు తగ్గించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జి.శారద, సి.హెచ్.రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


ప్రకృతి ఒడిలో నివాసం




వినాయకుని రూపంలో..

గృహమే కదా స్వర్గసీమ అనే పదానికి నిర్వచనంగా కనిపిస్తోంది కదూ ఈ ఇల్లు. తణుకు మండలం వేల్పూరుకు చెందిన నూనె వెంకటరావు ఇల్లు ఇది. తన ఇంటిని నందనవనంగా మార్చారు. ఇంటి ముంగిట మొక్కలు ఏర్పాటుచేసి వాటిని వినాయకుడు, శివలింగం రూపాల్లో కత్తిరించారు. ఇంటి పైభాగంలో స్వాగతం బోర్డును కూడా తీగజాతి మొక్కలతో తీర్చిదిద్దారు. గేటుకు వేలాడే కుండీలను అమర్చి అందులో మొక్కలు వేశారు. -ఈనాడు, తణుకు


పచ్చని మొక్కలతో స్వాగతం


పక్షుల ఆకారంలో

ఆశా కార్యకర్తల ధర్నా

భీమడోలు, న్యూస్‌టుడే: బి.సింగవరంలో పీహెచ్‌సీలో ఆశా కార్యకర్త కెల్లమ్మను అకారణంగా తొలగించడాన్ని నిరసిస్తూ భీమడోలు మండలం పూళ్ల, గుండుగొలను గ్రామాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వద్ద ఆశా కార్యకర్తలు గురువారం ధర్నాలు చేశారు. ఆ సంఘ నాయకులు పద్మ, నయోమీ, ఉదయరాణి తదితరులు పాల్గొన్నారు.

పీఎంశ్రీ పథకంపై అవగాహన

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: ప్రధానమంత్రి స్కూల్ ఫర్ రైజింగ్ ఇండియా (పీఎంశ్రీ) పథకంలో భాగంగా విద్యార్థినులకు అవగాహన కార్యక్రమాన్ని గురువారం భీమవరంలో నిర్వహించారు. పీఎంశ్రీ పథకంలో భాగంగా ఒకేషనల్ శిక్షణలో భాగంగా విద్యార్థులకు రిటైల్ రంగ వ్యాపారం గురించి వివరించారు. ప్రధానోపాధ్యాయుడు పి.బి.శ్రీనివాసరావు, ఒకేషనల్ శిక్షకుడు కె.రాంజీ అంబేడ్కర్ తదితరులు పాల్గొన్నారు.